


# శివసూర్య

SHIVA SURYA TELUGU DAILY
RNI APTEL : 2023/88704
తెలుగు దిన పత్రిక




కర్నూలు సంపుటి : 03, సంచిక :06 ఛీఫ్ ఎడిటర్.. పేజిలు : 08, వెల రూ. 2రూ /సోమవారం -14- సెప్టెంబర్ - 2026
Published From Kurnool : Circulated at Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa,



## సౌదీ అరేబియాకు షాక్.. ఎర్ర సముద్ర మార్గానికీ హౌతీల ముప్పు

- ఎర్ర సముద్ర తీరంలో వేగంగా బలపడుతున్న హౌతీ రెబల్స్
- కీలకమైన మోఖా పోర్టు, పెరిమ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకున్న హౌతీలు
- డ్రోన్ దాడులతో సౌదీ తూర్పు-పశ్చిమ పైప్‌లైన్ మూసివేత
- సౌదీ చమురు ఎగుమతులపై తీవ్ర ప్రభావం, తగ్గిన సరఫరా
- అంతర్జాతీయంగా 100 డాలర్లు దాటిన ముడిచమురు ధరలు

## భారత పౌరసత్వంపై గ్రోక్ సమాధానం.. ఎలాన్ మస్క్ వైరల్ కామెంట్



- భారత్‌లో స్థిరపడాలనుకున్న ఐర్లాండ్ వ్యక్తికి గ్రోక్ ఏఐ సమాధానం
- పౌరసత్వానికి 12 ఏళ్ల నివాసం తప్పనిసరి అని వెల్లడి
- ఈ సంభాషణపై 'ఇండియా ఈజ్ రియలిస్టిక్' అని స్పందించిన ఎలాన్ మస్క్



## ఉపాధ్యాయ అభ్యర్థుల కెరీర్లు మీకు అపహాస్యంగా మారాయా?

- స్కిల్ కేసులో క్లీన్‌చిట్ అని చెప్పడం దౌర్భాగ్యం
- ఏడు దశల్లో వెరిఫికేషన్ అంటే ఇదేనా చంద్రబాబూ?
- దీనిని ఏ విధంగా న్యాయమైనది, పారదర్శకమైనది అని అనగలం?
- వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

## రాష్ట్రం గర్వించే క్రీడాకారుడిని అవమానించొద్దు: జగన్ కు నారా లోకేశ్ హితవు



- డీఎస్సీ స్పోర్ట్స్ కోటాపై జగన్ ఆరోపణలకు మంత్రి లోకేశ్ కౌంటర్
- రాష్ట్రం గర్వించే క్రీడాకారుడిని అవమానిస్తున్నారని విమర్శ
- బాక్సర్ పెద్ద అప్పలరాజు నేషనల్ ఛాంపియన్ అని వెల్లడి
- ఆధారాలతో సోషల్ మీడియాలో వీడియో పోస్ట్ చేసిన లోకేశ్

# పంచ సూత్రాల రాజధానిగా అమరావతి

## వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన కేంద్రం

- ★అమరావతిలో క్వాంటమ్ బయో వ్యాలీ
- ★జనవరి 1 నుంచి హెల్త్ రికార్డుల డిజిటలైజేషన్
- ★ఆరోగ్య, సుసంపన్న ఆంధ్రప్రదేశ్ కోసం ఎన్డీయే
- ★'ఎక్స్'లో నడ్డాకు సీఎం కృతజ్ఞతలు



అమరావతి: అమరావతి గురించి లద్దాఖ్‌లోనూ ప్రస్తావనకు వచ్చింది. భవిష్యత్తులో ఎక్కడికి వెళ్లినా అమరావతి గురించి చర్చించుకునే రోజు వస్తుంది. పంచ సూత్రాల రాజధానిగా అమరావతిని ప్రపంచంలోనే ప్రత్యేక నగరంగా, భవిష్యత్తు సాంకేతికతకు కేంద్రంగా తీర్చిదిద్దుతున్నాం. నో పోల్ సిటీగా.. బ్లూ సిటీ, గ్రీన్ సిటీ, గ్రీన్ ఎనర్జీ, డీప్ టెక్నాలజీ సిటీగా రాజధాని నగరాన్ని నిర్మిస్తున్నాం. యువత శారీరక శ్రమతో పాటు సాంకేతిక నైపుణ్యాలతో స్మార్ట్ వర్క్ చేసి గ్లోబల్ లీడర్లుగా ఎదగాలి. ఏఐ రంగంలో నిపుణులను తీర్చిదిద్దేందుకు యువతకు శిక్షణ ఇస్తున్నాం. మిగతా 2 లో



## వైసీపీలో కీలక మార్పులు.. పలువురికి కొత్త బాధ్యతలు అప్పగించిన జగన్

- వైసీపీ ప్రాంతీయ సమన్వయకర్తల పదవుల్లో మార్పులు
- వైవీ సుబ్బారెడ్డి, అయోధ్య రామిరెడ్డిలకు కీలక బాధ్యతలు
- రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షుడిగా బీరక సురేంద్రబాబు
- డీఎస్సీ అభ్యర్థులకు మద్దతుగా పోరాట కమిటీ ఏర్పాటు
- న్యాయ పోరాటం కోసం ప్రత్యేకంగా లీగల్ సెల్ నియామకం

అమరావతి: వైసీపీలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి

# 14న తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

## శ్రీవేంకటేశ్వర స్వామివారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు తిరుమల ముస్తాబు

- మంగళవారం నుంచి 23వ తేదీ వరకు కనులపండువగా నిర్వహించనుంది
- నిత్యం ఉదయం 8 గంటలకు, సాయంత్రం 7 గంటలకు వాహనసేవలు
- ఈ నెల 15 నుంచి 23 వరకు ఆర్జిత సేవలైన అష్టదళ పాదపద్మారాధన, తిరుప్పావడ, కల్యాణోత్సవం, ఊంజల్, సహస్రదీపాలంకార సేవలను తితిదే రద్దు



తిరుమల: శ్రీవేంకటేశ్వర స్వామివారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు తిరుమల ముస్తాబైంది. ఈ వేడుకలను తితిదే మంగళవారం మిగతా 2 లో

# కొత్తగా 100 బీసీ కాలేజీ హాస్టళ్ల ఏర్పాటు

## బీసీ రక్షణ చట్టాన్ని తీసుకొస్తాం: సీఎం

- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను సాధ్యమైనంత త్వరగా దశలవారీగా చెల్లిస్తా



హైదరాబాద్: రాష్ట్రంలో బీసీ రక్షణ చట్టాన్ని తీసుకొస్తామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని రాజ్యసభ సభ్యులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య తెలిపారు. అసెంబ్లీలో ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డితో సమావేశమై బీసీలకు సంబంధించిన పలు సమస్యలను సీఎంకు వివరించి వినతిపత్రం మిగతా 2 లో

## అక్రమార్కులకు ముకుతాడు వేసేందుకు

# బోను సిద్ధంగా ఉంది

## 22ఏ ఉమ్మడి రాష్ట్రం నుంచే అమల్లో ఉంది.. కొత్తగా పెట్టింది కాదు

- ధరణి పేరుతో భూముల దోపిడీ
- ఫోరెన్సిక్ ఆడిట్‌లో వెలుగుచూసిన ఆధారాలు
- మేం నిషేధిత జాబితాలో ఒక్క ఎకరానూ కొత్తగా చేర్చలేదు
- ఇళ్లు నిర్మించుకుని దీర్ఘకాలికంగా ఉంటున్న వారిపై త్వరలో విధాన నిర్ణయం
- శాసనసభలో రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి



హైదరాబాద్: 'ధరణి పోర్టల్' పేరుతో గత పాలకులు ప్రభుత్వ భూముల దోపిడీకి పాల్పడ్డారు. నిషేధిత జాబితాలోని భూములను కొద్ది సమయంపాటు తొలగించి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుని తిరిగి ఆ జాబితాలో పెట్టేవారు. ధరణి అక్రమాలపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహిస్తే దోపిడీకి సంబంధించి మిగతా 2 లో



## నందిగ్రామ్‌లో పోటీ చేయండి.. మా అభ్యర్థి ఉండరు మమతకు రెబల్స్ ఆఫర్

- నందిగ్రామ్ ఉపఎన్నికలో మమతపై పోటీకి దూరంగా ఉంటామన్న టీఎంసీ రెబల్
- ఆమె పోటీ చేస్తే తమ అభ్యర్థిని నిలబెట్టబోమని స్పష్టం చేసిన తిరుగుబాటు వర్గం
- మమత కూడా అసెంబ్లీలో ఉండాలని కోరుకుంటున్నామన్న విపక్ష నేత శుభేందు అధికారి రాజీనామాతో నందిగ్రామ్‌కు ఉపఎన్నిక

## 22ఏపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పచ్చి అబద్ధాలు మాట్లాడారు




- అసెంబ్లీ సాక్షిగా పొంగులేటి అబద్ధాలు
- మా మామపై మాట్లాడింది కూడా అసత్యాలే
- నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్‌వోసీ ఇచ్చిన భూమినే మా మామ కొన్నారు
- పొంగులేటి భూబాగోతాన్ని బయటపెడుతున్నందుకే నాపై, నా కుటుంబంపై బురదజల్లే ప్రయత్నం
- మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం

# అక్రమార్కులకు ముకుతాడు వేసేందుకు బోను సిద్ధంగా ఉంది

హైదరాబాద్: 'ధరణి పోర్టల్ పేరుతో గత పాలకులు ప్రభుత్వ భూముల దోపిడీకి పాల్పడ్డారు. నిషేధిత జాబితాలోని భూములను కొద్ది సమయంపాటు తొలగించి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుని తిరిగి ఆ జాబితాలో పెట్టేవారు. ధరణి అక్రమాలపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహిస్తే దోపిడీకి సంబంధించి భయంకరమైన ఆధారాలు దొరికాయి. 13 వేల ఖాతాలకు 23 లక్షల ఎకరాల ఆస్తిని బదిలీ చేసినట్లు వెలుగు చూసింది' అని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఉమ్మడి ఏపీ నుంచే నిషేధిత జాబితా(22ఏ) అమల్లో ఉందని.. భారాస పాలకులు పదేళ్లలో ఆ జాబితాలో ఉన్న పేదల భూములు తొలగించలేదని విమర్శించారు. హైకోర్టు ఆదేశాలతోనే 2025లో ప్రభుత్వం 22ఏ జాబితాను అప్‌లోడ్ చేసిందని.. న్యాయస్థానం 45 రోజుల సమయమే ఇవ్వడంతో ధరణి, అంతకుముందు నవీకరించని జాబితానే కలెక్టర్లు అప్‌లోడ్ చేయడంతో సమస్య ఏర్పడిందని చెప్పారు. ఆ పొరపాటును సరిదిద్దామన్నారు. శాసనసభలో శనివారం 22ఏ అంశంపై జరిగిన చర్చలో ఆయన 3 గంటల 47 నిమిషాలపాటు ప్రసంగించారు. ఫోరెన్సిక్ ఆడిట్ రిపోర్టులోని వివరాలను సభ ముందుంచారు. హరీశ్‌రావు, ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, రఘునందన్‌రావు దుష్ప్రచారం చేశారంటూ వీడియో క్లిప్పింగ్స్‌ను సభలో ప్రదర్శించారు. మంత్రి ఏమన్నారంటే.. 'ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్‌ను 1999లో రిజిస్ట్రేషన్ చేయడంతో నాటి ప్రభుత్వం 22ఏ చట్టం అమల్లోకి తెచ్చింది. 2015న ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం 22ఏలో ఏ నుంచి ఈ వరకు సబ్ సెక్షన్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించింది. 2025లోనూ ధర్మాసనం ఆదేశించి 45 రోజుల గడువు ఇచ్చింది. తక్కువ సమయం ఉండటంతో పాత డేటా అప్‌లోడ్ అయింది. దీంతో సమస్యలు రాగా సరిదిద్దాం. విలువైన ఆస్తులను ఎలా కొల్లగొట్టవచ్చో మాస్టర్ స్కెచ్ వేసి ధరణి తీసుకొచ్చారు. వారి తొత్తైన టెరాసిస్ అనే విదేశీ సంస్థకు 2.49 కోట్ల ఎకరాల భూములను తాకట్టు పెట్టారు. ఆ సంస్థ నుంచి భూములు మరో సంస్థకు బదిలీ అయ్యాయి. అర్ధరాత్రి రిజిస్ట్రేషన్లు చేశారు. అందుకే 2024 డిసెంబరు 1న భూ భారతిని ఎన్ఐసీకి అప్పగించాం. ఇప్పటికీ టెర్రాసిస్ నిర్వాహకులు భూ భారతిలోకి రెండుసార్లు ప్రవేశించారు. మొదటిసారి రిజిస్ట్రేషన్ ఫీజులు దారిమళ్లించారు. ఎస్ఈటీ ఏర్పాటుకు ముందు భూ భారతిలో ప్రవేశించి 50 ఎకరాల ఎసైన్డ్ భూములు బదిలీ చేశారు. దానిని గుర్తించాం. రాష్ట్రంలో అధికారం కోల్పోయినా వారే అధికారంలో ఉన్నట్లు పేదల ఆస్తులను కొల్లగొట్టాలని చూస్తున్నారు. అటువంటి ఆలోచనలు మానుకోండి. లేదంటే ఫలితాలు కొద్ది రోజుల్లో అనుభవిస్తారని హెచ్చరిస్తున్నాం. హైదరాబాద్‌లో సీఎస్ 7, 13, 14లకు సంబంధించి హరీశ్‌రావు వక్రీకరించి మాట్లాడుతున్నారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హైదర్‌నగర్‌లో 145, 163 సర్వే నంబర్లను జాబితా నుంచి తొలగించాలని సీఎంను కోరారు. ఆ భూములు ఉమ్మడి ఏపీ నుంచే జాబితాలో ఉన్నాయి. ఖరీదైన ఈ భూముల రుచి చూసిన ఓ పెద్ద మనిషి గతంలో ఒక బెంజ్‌కారు పొందారు. మనిషి రక్తం రుచిచూసిన పులిలా.. అదే ధ్యాసలో ఉన్నారు. కానీ, రేవంత్‌రెడ్డి అనే బోను ఉందని మర్చిపోయారు. ముకుతాడు వేసి కట్టేస్తాడని తెలిసి నిద్రపట్టని రాత్రులు గడుపుతున్నారు. పదేళ్లు సీఎంగా ఉన్న కేసీఆర్ జటిలమైన ఇలాంటి సమస్యలు ఎందుకు పరిష్కరించలేదు. ధరణిలో లావాదేవీలకు, తొలగింపు భూములకు లెక్కా పత్రం లేదు. భూ భారతిలో పక్కా లెక్కలు ఉన్నాయి. వారి పాలనలో 22ఏ నుంచి తొలగించిన 23 వేల ఎకరాలకు పత్రాలు లేవు. రాష్ట్రంలో ఎసైన్డ్, యూఎల్‌సీ తదితర భూముల్లో నివాసాలు ఉన్న ప్రాంతాలపై త్వరలో ఒక విధానపరమైన నిర్ణయం తీసుకునే దిశగా ఆలోచన చేస్తున్నాం. భువనగిరి, మంచిర్యాలలో ఏళ్ల నుంచి ఎసైన్డ్ భూముల్లో ఇళ్లున్నాయి. ఇంటి నంబర్లతో రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగానూ ఉన్నాయి. మేం నిషేధిత జాబితాలో కొత్తగా ఒక్క ఎకరా చేర్చలేదు. ఎసైన్డ్, యూఎల్‌సీ సమస్యలపై విధాన పరమైన నిర్ణయం తీసుకుంటాం. ప్రజాధనంతో ఇన్నేళ్లు అధికారం అనుభవించిన వాళ్లు ప్రజల సమస్యల పరిష్కారంలో విఫలమయ్యారు. మీరు కదా రాజీనామా చేయాల్సింది. నేను ప్రతి నెలా ఒక్క రూపాయి జీతం మాత్రమే తీసుకుంటూ పేదల కోసం ఇందిరమ్మ ఇళ్లు, టవర్స్ నిర్మాణంతోపాటు ప్రజా సమస్యల పరిష్కారానికి పనిచేస్తున్నా. నన్ను రాజీనామా చేయాలంటారా? ఇప్పటి వరకు రూ.21 కోట్లు తీసుకుని సభకు మొహం చాటేసిన కేసీఆర్ చేయాలి. అధికారంలో ఉంటే అవినీతి, ప్రతిపక్షంలో ఉంటే బ్లాక్‌మెయిల్ వ్యవహారం మీది' అని మంత్రి పొంగులేటి విరుచుకుపడ్డారు.

# సౌదీ అరేబియాకు షాక్..
# ఎర్ర సముద్ర మార్గానికీ హౌతీల ముప్పు

ఢిల్లీ: సౌదీ అరేబియా తన చమురు ఎగుమతుల విషయంలో తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఒకవైపు హార్ముజ్ జలసంధిలో ఉద్రిక్తతలు, మరోవైపు ఇరాకీ మిలిటెంట్ల డ్రోన్ దాడులతో పాటు తాజాగా యెమెన్‌కు చెందిన హౌతీ రెబల్స్ ఎర్ర సముద్రంలో పట్టు బిగించడం రియాద్‌ను ఇరకాటంలోకి నెట్టింది. ప్రపంచ చమురు రవాణాలో కీలకమైన రెండు ప్రధాన మార్గాలు ఏకకాలంలో ప్రమాదంలో పడటంతో అంతర్జాతీయ మార్కెట్లలో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇరాన్ మద్దతున్న యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదారులు ఇటీవలి కాలంలో ఎర్ర సముద్ర తీరంలో వేగంగా ముందుకు సాగుతున్నారు. కొన్ని రోజుల క్రితం కీలకమైన మోఖా ఓడరేవును, బాబ్ అల్-మందబ్ జలసంధికి సమీపంలో ఉన్న పెరిమ్ ద్వీపాన్ని వారు స్వాధీనం చేసుకున్నారు. ఈ చర్యతో ప్రపంచ చమురు, వాణిజ్య నౌకలకు అత్యంత ముఖ్యమైన బాబ్ అల్-మందబ్ జలసంధిపై వారి నియంత్రణ మరింత పెరిగింది. ఇదివరకు హార్ముజ్ జలసంధిలో సమస్యలు తలెత్తినప్పుడు, సౌదీ అరేబియా తన తూర్పు తీరంలోని చమురు క్షేత్రాల నుంచి ఎర్ర సముద్ర తీరానికి పైప్‌లైన్ ద్వారా ముడి చమురును రవాణా చేసి ఎగుమతులు చేసేది. ఇప్పుడు ఆ మార్గానికే హౌతీల రూపంలో ముప్పు ఏర్పడింది. దీనికి తోడు, శుక్రవారం ఇరాక్‌లోని ఇరాన్ అనుకూల మిలిటెంట్లు డ్రోన్లతో దాడి చేయడంతో సౌదీ తన తూర్పు-పశ్చిమ పైప్‌లైన్‌ను తాత్కాలికంగా మూసివేయాల్సి వచ్చింది. ఈ డ్రోన్ దాడులకు హౌతీలు సహకరించారని సౌదీ అధికారులు భావిస్తున్నారు. ఈ పరిణామాల కారణంగా ఆసియా దేశాలకు సౌదీ చేసే చమురు ఎగుమతులు భారీగా పడిపోయాయి. జూన్‌లో రోజుకు 34 లక్షల బ్యారెళ్లుగా ఉన్న ఎగుమతులు, ఆగస్టు నాటికి కేవలం 1.28 లక్షల బ్యారెళ్లకు పడిపోయాయి. ఈ నెలలో కాస్త కోలుకుని రోజుకు 7 లక్షల బ్యారెళ్లకు చేరాయి. ప్రస్తుత పరిస్థితుల్లో సౌదీ అరేబియా ముందున్న మార్గాలు పరిమితంగానే ఉన్నాయి. సైనిక చర్యకు దిగితే, వివాదం మరింత ముదిరి తమ ఇంధన మౌలిక సదుపాయాలపై దాడులు పెరిగే ప్రమాదం ఉంది. దౌత్యపరంగా పరిష్కారానికి ప్రయత్నిస్తే ఇరాన్, హౌతీల నుంచి కఠినమైన షరతులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. మరోవైపు, ఈ విషయంలో అమెరికా మద్దతు కూడా అనిశ్చితంగానే ఉంది. పశ్చిమాసియాలో మరో యుద్ధంలో జోక్యం చేసుకోవడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుముఖంగా లేరని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో బ్రెంట్ ముడిచమురు ధర బ్యారెల్‌కు 100 డాలర్ల పైకి చేరింది. తమ దేశాన్ని రక్షించుకోవడంతో పాటు, ఎర్ర సముద్రంలో నౌకాయాన స్వేచ్ఛను కాపాడేందుకు భాగస్వామ్య దేశాలతో కలిసి పనిచేస్తామని సౌదీ అధికారులు తెలిపారు.

### భారత పౌరసత్వంపై గ్రోక్ సమాధానం..
# ఎలాన్ మస్క్ వైరల్ కామెంట్

ఢిల్లీ: ఎలాన్ మస్క్‌కు చెందిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ చాట్‌బాట్ 'గ్రోక్' మరోసారి వార్తల్లో నిలిచింది. భారత్‌లో స్థిరపడాలనుకుంటున్న ఐర్లాండ్ పౌరుడొకరు అడిగిన ప్రశ్నకు గ్రోక్ ఇచ్చిన సమాధానం, దానికి ఎలాన్ మస్క్ జోడించిన వ్యాఖ్య ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళ్తే.. ఐర్లాండ్‌కు చెందిన ఒక వ్యక్తి తన భాగస్వామి, ఇద్దరు పిల్లలతో కలిసి ప్రస్తుతం కోల్‌కతాలో నివసిస్తున్నారు. తాను భారత్‌లోనే శాశ్వతంగా స్థిరపడాలని భావిస్తున్నట్లు పేర్కొంటూ, భారత పౌరసత్వం పొందాలంటే పట్టే సమయం గురించి ఆయన గ్రోక్‌ను ప్రశ్నించారు. దీనికి గ్రోక్ స్పందిస్తూ.. భారత సహజ పౌరసత్వం పొందాలంటే కనీసం 12 ఏళ్లపాటు ఇక్కడ చట్టబద్ధంగా నివసించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. దరఖాస్తు చేయడానికి ముందు గడిచిన 14 ఏళ్లలో 11 ఏళ్ల పాటు భారత్‌లో ఉండాలని, దరఖాస్తుకు ముందు చివరి ఏడాది మాత్రం నిరంతరంగా దేశంలోనే నివసించాలనే నిబంధన ఉందని వివరించింది. అంతేకాకుండా, భారత్ ద్వంద్వ పౌరసత్వాన్ని అనుమతించదని, భారత పౌరసత్వం కావాలంటే ఐర్లాండ్ పౌరసత్వాన్ని వదులుకోవాల్సి ఉంటుందని తేల్చిచెప్పింది. పౌరసత్వం మంజూరు అనేది పూర్తిగా ప్రభుత్వ విచక్షణాధికారంపై ఆధారపడి ఉంటుందని కూడా పేర్కొంది. ఈ సంభాషణకు సంబంధించిన వీడియోను పీటర్ సెయింట్ ఒంజ్ అనే ఎక్స్ వినియోగదారుడు పంచుకోగా, దానిపై ఎలాన్ మస్క్ స్పందిస్తూ.. "ఇండియా ఈజ్ అమేజింగ్" (భారత్ వాస్తవికంగానే అద్భుతంగా ఉంది) అని వ్యాఖ్యానించారు. మస్క్ చేసిన ఈ చిన్న వ్యాఖ్య నెట్టింట పెద్ద చర్చకు దారితీసింది. మస్క్ వ్యాఖ్యలతో నెటిజన్లు ఏకీభవిస్తూ.. "భారత్ ఎప్పటి నుంచో వాస్తవికంగానే ఉంది", "భారత్ ఒక అద్భుతమైన దేశం" అంటూ కామెంట్లతో మద్దతు తెలుపుతున్నారు.

### రాష్ట్రం గర్వించే క్రీడాకారుడిని అవమానించొద్దు
# జగన్ కు నారా లోకేశ్ హితవు

అమరావతి: డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాలపై వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న ఆరోపణలకు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ గట్టిగా బదులిచ్చారు. రాజకీయ విమర్శల కోసం రాష్ట్రం గర్వించదగ్గ క్రీడాకారుడిని అవమానించడం తగదని హితవు పలికారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో ఓ పోస్ట్ చేశారు. "పెద్ద అప్పలరాజు ఆంధ్రప్రదేశ్ గర్వించదగ్గ బాక్సర్. ఆయన నేషనల్ ఛాంపియన్. ఆయన సెమీఫైనల్ వీడియోలు ఇప్పటికీ దూరదర్శన్‌లో ఉన్నాయి. రాష్ట్రం గర్వించే క్రీడాకారుడిని అవమానించడం ఇప్పటికైనా ఆపండి జగన్ గారు" అని లోకేశ్ తన పోస్టులో పేర్కొన్నారు. తన వ్యాఖ్యలకు ఆధారంగా బాక్సర్ అప్పలరాజు ఆడుతున్న పాత వీడియోను కూడా ఆయన షేర్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ-2025 ఉపాధ్యాయ నియామక ప్రక్రియలో భారీ కుంభకోణం జరిగిందని జగన్ ఆరోపణలు చేస్తుండడం తెలిసిందే. నిన్న తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడారు. ఈ అక్రమాలపై వెంటనే సీబీఐతో విచారణ జరిపించాలని, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. క్రీడల కోటాలో జరిగిన అక్రమాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని జగన్ అన్నారు. అసలు జరగని క్రీడలకు నకిలీ సర్టిఫికెట్లు సృష్టించి, కొందరికి పరీక్ష కూడా నిర్వహించకుండానే ఉద్యోగాలు ఇచ్చారని ఆరోపించారు. ఆ తప్పుడు సర్టిఫికెట్లను ధ్రువీకరించింది, నియామకాలు జరిపింది కూడా వారేనని విమర్శించారు. ఈ విషయంపై అధికారులు కూడా సరైన సమాధానం ఇవ్వలేకపోతున్నారని, సమర్పించిన స్పోర్ట్స్ సర్టిఫికెట్లు అసలైనవో కావో నిర్ధారించలేకపోతున్నారని తెలిపారు. ఈ కుంభకోణంపై సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఎందుకు స్పందించడం లేదని జగన్ ప్రశ్నించిన నేపథ్యంలో, తాజాగా లోకేశ్ ఓ వీడియో ఆధారంతో కౌంటర్ ఇవ్వడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# నందిగ్రామ్‌లో పోటీ చేయండి..
# మా అభ్యర్థి ఉండరు: మమతకు రెబల్స్ ఆఫర్

ఢిల్లీ: పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. నందిగ్రామ్ అసెంబ్లీ స్థానానికి జరగనున్న ఉపఎన్నికలో మమతా బెనర్జీ పోటీ చేస్తే, తాము అభ్యర్థిని నిలబెట్టబోమని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) తిరుగుబాటు వర్గం ప్రకటించింది. "మేము కూడా మమతా బెనర్జీ అసెంబ్లీకి రావాలని కోరుకుంటున్నాము" అని రెబల్ వర్గం నేత, విపక్ష నాయకుడు రీతబ్రత బెనర్జీ పేర్కొన్నారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నేత సువేందు అధికారి భవానీపూర్, నందిగ్రామ్ రెండు స్థానాల్లోనూ గెలిచారు. భవానీపూర్‌లో మమతా బెనర్జీని ఓడించిన ఆయన, నందిగ్రామ్ స్థానానికి రాజీనామా చేయడంతో అక్కడ ఉపఎన్నిక అనివార్యమైంది. ఎన్నికల తర్వాత టీఎంసీలో ఏర్పడిన విభేదాలతో పలువురు ఎమ్మెల్యేలు రీతబ్రత బెనర్జీ నాయకత్వంలో తిరుగుబాటు వర్గంగా ఏర్పడ్డారు. శనివారం ఢిల్లీలో ఎన్నికల సంఘం అధికారులతో భేటీ అనంతరం రీతబ్రత బెనర్జీ మీడియాతో మాట్లాడారు. తమ అభ్యర్థిని దాదాపు ఖరారు చేసుకున్నప్పటికీ, మమత పోటీ చేస్తే మాత్రం నిలబెట్టబోమని స్పష్టం చేశారు. "మమతా బెనర్జీ సాధారణ ఎన్నికల్లో గెలవరు, కానీ ఉపఎన్నికల్లో గెలుస్తారు. సొంత ప్రాంతంలో ఆమె ఓడిపోవడం బాగుండదు" అని వ్యాఖ్యానించారు. మరో రెబల్ నేత అఖ్రుజ్జమాన్ మాట్లాడుతూ "నందిగ్రామ్‌కు రండి. మేము అభ్యర్థిని నిలబెట్టం. గెలిచి అసెంబ్లీకి రండి. అభివృద్ధికి కలిసి పనిచేద్దాం" అని మమతకు పిలుపునిచ్చారు. అయితే, టీఎంసీ పార్టీ పేరు, గుర్తు కోసం ఈ రెండు వర్గాల మధ్య వివాదం ఎన్నికల సంఘం వద్ద కొనసాగుతోంది. ఈ ఆఫర్‌పై మమతా బెనర్జీ ఇంకా స్పందించలేదు. నందిగ్రామ్, రెజీనగర్ స్థానాలకు అక్టోబర్ 6న పోలింగ్ జరగనుండగా, అక్టోబర్ 9న ఫలితాలు వెలువడనున్నాయి. నామినేషన్ల దాఖలుకు సెప్టెంబర్ 16 చివరి తేదీ.

# వైసీపీలో కీలక మార్పులు..
# పలువురికి కొత్త బాధ్యతలు అప్పగించిన జగన్



అమరావతి: వైసీపీలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పలువురు నేతలకు కొత్త బాధ్యతలు అప్పగిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. ప్రధానంగా ప్రాంతీయ సమన్వయకర్తల (రీజనల్ కోఆర్డినేటర్ల) నియామకాల్లో ఈ మార్పులు జరిగాయి. తాజా మార్పుల ప్రకారం.. ఎంపీ వై.వి. సుబ్బారెడ్డిని ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రాంతీయ సమన్వయకర్తగా నియమించారు. గతంలో ఆయన కృష్ణా, గుంటూరు జిల్లాల బాధ్యతలను పర్యవేక్షించేవారు. మరో ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డికి ఉమ్మడి కృష్ణా, ఉమ్మడి ప్రకాశం జిల్లాల సమన్వయ బాధ్యతలను అప్పగించారు. ఇక మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావును ఉమ్మడి నెల్లూరు జిల్లా బాధ్యతలకు పరిమితం చేశారు. ఇదే క్రమంలో బాపట్ల జిల్లా చీరాల నియోజకవర్గానికి చెందిన బీరక సురేంద్రబాబును రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షుడిగా నియమించారు. వీటితో పాటు డీఎస్సీ-2025లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తున్న అభ్యర్థులకు అండగా నిలిచేందుకు ఒక పోరాట కమిటీని, న్యాయపోరాటం కోసం లీగల్ సెల్‌ను కూడా జగన్ ఏర్పాటు చేశారు. డీఎస్సీ పోరాట కమిటీలో ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, తమడం కల్పలత, పానుగంటి చైతన్య, రవిచంద్ర ఉండగా.. లీగల్ సెల్‌లో పొన్నవోలు సుధాకర్ రెడ్డి, మలసాని మనోహర్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, జీవీఎస్ కిషోర్‌లను సభ్యులుగా నియమించారు.

# పంచ సూత్రాల రాజధానిగా అమరావతి

అమరావతి: అమరావతి గురించి లద్దాఖ్‌లోనూ ప్రస్తావనకు వచ్చింది. భవిష్యత్తులో ఎక్కడికి వెళ్లినా అమరావతి గురించి చర్చించుకునే రోజు వస్తుంది. పంచ సూత్రాల రాజధానిగా అమరావతిని ప్రపంచంలోనే ప్రత్యేక నగరంగా, భవిష్యత్తు సాంకేతికతకు కేంద్రంగా తీర్చిదిద్దుతున్నాం. నో పోల్ సిటీగా.. బ్లూ సిటీ, గ్రీన్ సిటీ, గ్రీన్ ఎనర్జీ, డీప్ టెక్నాలజీ సిటీగా రాజధాని నగరాన్ని నిర్మిస్తున్నాం. యువత శారీరక శ్రమతో పాటు సాంకేతిక నైపుణ్యాలతో స్మార్ట్ వర్క్ చేసి గ్లోబల్ లీడర్లుగా ఎదగాలి. ఏఐ రంగంలో నిపుణులను తీర్చిదిద్దేందుకు యువతకు శిక్షణ ఇస్తున్నాం.

దేశంలోనే తొలిసారిగా అత్యాధునిక సాంకేతికత, జీవశాస్త్ర పరిశోధనల కలయికతో 'అమరావతి క్వాంటమ్ బయో వ్యాలీ'ని ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. రాష్ట్ర రాజధానిలో ఏర్పాటు చేయబోయే ఈ ప్రాజెక్ట్ దేశ ఆరోగ్య, పరిశోధనా రంగానికి సరికొత్త దిక్సూచిగా మారనుందని తెలిపారు. క్వాంటమ్ కంప్యూటింగ్, ఏఐ, ప్రయోగశాలల ఆటోమేషన్, ఎక్స్‌పెరిమెంటల్ బయాలజీలను ఒకే వేదికపైకి తేవడమే ఈ క్వాంటమ్ బయో వ్యాలీ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. దీన్ని జాతీయ ప్రాజెక్టుగా గుర్తించాలని కేంద్రాన్ని కోరారు. ప్రపంచ బయో ఎకానమీలో 111 మిలియన్ డాలర్ల వాటాతో ఆంధ్రప్రదేశ్ టాప్ 5లో ఉందని.. రాబోయే పదేళ్లలో గ్లోబల్ బయో ఎకానమీ పవర్‌హౌస్‌గా మారుతుందని చెప్పారు. విజయవాడలో జరిగిన క్రిటికల్ కేర్ బ్లాకులు, ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబొరేటరీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. ముఖ్యాంశాలివీ.. 'రూ.249 కోట్లతో క్రిటికల్ కేర్ బ్లాకులు, ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబొరేటరీల ప్రారంభంతో అత్యవసర పరిస్థితుల్లో పేద, మధ్యతరగతి కుటుంబాలకు మెరుగైన వైద్యం మరింత చేరువవుతుంది. ఈ ప్రాజెక్టులతో రాష్ట్రంలో 500 క్రిటికల్ కేర్ బెడ్లు, అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, అల్ట్రాసౌండ్ సదుపాయాలతో పాటు కార్డియాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ, న్యూరోసర్జరీ వంటి కీలక వైద్య విభాగాల సేవలు అందుబాటులోకి వచ్చాయి.

కేంద్ర ప్రభుత్వం గత 12 ఏళ్లలో వైద్య రంగంలో అనేక విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. దేశంలో వైద్యవిద్య సీట్లను 51 వేల నుంచి రెండింతలకు పైగా పెంచారు. కొవిడ్ సమయంలో ప్రపంచానికి వ్యాక్సిన్ అందించిన ఘనత భారతదేశానికి, ప్రధాని నరేంద్ర మోదీకి దక్కుతుంది. మంగళగిరి ఎయిమ్స్‌ను అద్భుతంగా అభివృద్ధి చేస్తున్నారు. జన ఔషధి కేంద్రాల ద్వారా పేదలకు మందులు అందుతున్నాయి. ఆయుష్మాన్‌భారత్ కార్డుల ద్వారా మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తున్నాయి. ఫార్మా రంగానికి ఏపీ చిరునామాగా మారింది. మెడ్‌టెక్ పార్కు ద్వారా వైద్య పరికరాల ఉత్పత్తిని ప్రోత్సహిస్తున్నాం. కేంద్ర సహకారం, రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం, ప్రజల భాగస్వామ్యంతో ఆంధ్రప్రదేశ్‌ను అన్ని రంగాల్లో దేశంలోనే నంబర్ 1గా నిలుపుతాం.

### స్మార్ట్ వర్క్‌తో ఒత్తిడి దూరం

వంట గదినే ఫార్మసీగా.. ఆహారాన్నే ఔషధంగా మార్చుకోవాలి. యోగా, ప్రాణాయామం, ధ్యానం వంటివి నిత్య జీవితంలో భాగం చేసుకోవాలి. ఒత్తిడిని దూరం చేసుకుని స్మార్ట్ వర్క్ చేయాలి. సంప్రదాయ ఆరోగ్య విధానాలను కొనసాగిస్తూనే ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటే వైద్యారోగ్య రంగంలో మరింత మెరుగైన సేవలు అందించగలం. రాష్ట్ర వైద్యారోగ్య రంగానికి నిధులు కేటాయిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాలకు కృతజ్ఞతలు. నడ్డా నాయకత్వంలో దేశప్రజల ఆరోగ్యం మరింత మెరుగుపడుతుందన్న నమ్మకం ఉంది.

రామాయణంలో లక్ష్మణుడి ప్రాణాలు కాపాడేందుకు హనుమంతుడు సంజీవని పర్వతాన్నే తీసుకొచ్చినట్లు.. పేదల ముంగిటకే అంతర్జాతీయ వైద్య పరిజ్ఞానాన్ని సంజీవని రూపంలో తెస్తున్నాం. జనవరి 1 నుంచి ప్రజల ఆరోగ్య రికార్డులను డిజిటలైజ్ చేస్తాం. వ్యాధుల ముందస్తు అంచనా, నివారణ, చికిత్స, వైద్య ఖర్చులు తగ్గించడం ఈ ప్రాజెక్టు లక్ష్యం.

అమరావతి క్వాంటమ్ బయో వ్యాలీ ప్రాజెక్టుకు పూర్తి మద్దతు ఇస్తామని, సంజీవని ఆరోగ్య కార్యక్రమం దేశవ్యాప్తంగా అమలు చేసే అంశం పరిశీలిస్తామని ప్రకటించిన కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డాకు ముఖ్యమంత్రి చంద్రబాబు 'ఎక్స్' వేదికగా ధన్యవాదాలు తెలిపారు. 'రాష్ట్రవ్యాప్తంగా 10 క్రిటికల్ కేర్ బ్లాకులు, 12 ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబ్‌లు ప్రారంభించేందుకు విజయవాడలో మాతో కలిసినందుకు ధన్యవాదాలు. ప్రధాని మోదీ నాయకత్వంలో డబుల్ ఇంజిన్ ఎన్డీయే ప్రభుత్వం ఆరోగ్య, సుసంపన్న ఆంధ్రప్రదేశ్ కోసం నిరంతరం పనిచేస్తూనే ఉంటుంది' అని పేర్కొన్నారు.

### 22ఏపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
# పచ్చి అబద్ధాలు మాట్లాడారు



హైదరాబాద్: అసెంబ్లీ సాక్షిగా 22ఏపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పచ్చి అబద్ధాలు మాట్లాడారని అసెంబ్లీలో భారాస డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ టి.హరీశ్‌రావు విమర్శించారు. మంత్రి, ఆయన కుమారుడు చేస్తున్న భూబాగోతాలను ఒక్కొక్కటిగా బయటపెడుతున్నాననే కక్షతో.. తనపై, తన కుటుంబ సభ్యులపై వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. తెలంగాణ భవన్‌లో శనివారం రాత్రి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తొందరపడి నిషేధిత జాబితాలో పెట్టిన ఇళ్లను, భూములను ఎంత వేగంగా ఆ జాబితా నుంచి తొలగిస్తారో మంత్రి సమాధానమివ్వాలని డిమాండ్ చేశారు. "22ఏ విషయంలో తప్పు జరిగిందని పొంగులేటి అసెంబ్లీలో అంగీకరించారు... అది అభినందనీయమే. ఆయన క్షమాపణ చెబుతారని ప్రజల ఆశించారు. ఇదంతా తమ హయాంలో జరగలేదు.. గతంలోనే నిషేధిత జాబితాలో ఉందని బుకాయించే ప్రయత్నం చేశారు. గతంలో సమస్య ఉంటే.. అప్పుడెందుకు రిజిస్ట్రేషన్లు ఆగలేదు... ఇప్పుడు ఎందుకు ఆగాయి? ప్రజలు ఎందుకు రోడ్ల మీదకు వచ్చారు? తప్పే జరగకపోతే.. మీరెందుకు ఇటీవల సారీ చెప్పారు? అధికారుల మీదకు నెట్టేసే ప్రయత్నం ఎందుకు చేశారు? భూభారతి వెబ్‌సైట్‌లోకి ఎవరో ప్రవేశించారని.. ఎసైన్డ్ భూములు, పట్టా భూములు తెలియకుండానే రిజిస్ట్రేషన్లు అయిపోతున్నాయని మీరు అంగీకరించారు. భూభారతిని అత్యంత పకడ్బందీగా రూపొందిస్తే అలా ఎలా జరుగుతుంది? రిజిస్ట్రేషన్ చలాన్లలో అవకతవకలను బయటపెట్టిందే భారాస. ఆ స్కాంలో అధికారుల మీద చర్యలు తీసుకోకుండా ఆపరేటర్లపై తీసుకొని మిన్నకుండిపోయారు" అని హరీశ్ అన్నారు. "మా మామ ఒక భూమిని కబ్జా చేశారని ఆరోపించారు. అది అవాస్తవం. ఆయన ఒక రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి. ఒక రిటైర్డ్ ఆర్మీ అధికారికి 1995లో అప్పటి ప్రభుత్వం భూమి కేటాయించింది. 2010లో కాంగ్రెస్ సర్కారు హయాంలోనే ఆ భూమికి ఎన్‌వోసీ ఇచ్చింది. దాని ఆధారంగా ఆ భూమిని మా మామ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఆ భూమి ఇప్పుడు ఎకరం రూ.15 కోట్లు ఉంటుందంటున్నారు మంత్రి... రూ.50 లక్షలకు ఇస్తాం రిజిస్ట్రేషన్ చేసుకోండి" అని హరీశ్ అన్నారు. "పొంగులేటి మాపై మరో అబద్ధం చెప్పారు. మా భూమి మిషన్ భగీరథలో పోతే.. డబ్బులు తీసుకున్నానన్నారు. కానీ ఆ భూమి గోదావరి సుజల స్రవంతి పథకంలో భాగంగా పోయింది. చెక్ ఇచ్చింది కూడా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వమే. 2011లో మ్యుటేషన్ కూడా జరిగింది" అని వివరించారు.

# 14న తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



తిరుమల: శ్రీవేంకటేశ్వర స్వామివారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు తిరుమల ముస్తాబైంది. ఈ వేడుకలను తితిదే మంగళవారం నుంచి 23వ తేదీ వరకు కనులపండువగా నిర్వహించనుంది. సోమవారం సాయంత్రం శ్రీనివాసుడి సేనాధిపతి విష్వక్సేనుడు ఆలయ పరిసరాల్లో, తిరువీధుల్లో విహరించి ఏర్పాట్లను పర్యవేక్షించనున్నారు. అదేరోజు వేదపండితులు, అర్చకుల మంత్రోచ్చారణ నడుమ భూమిపూజ చేసి, పుట్టమట్టి సేకరించి, యాగశాలలోని కొత్తపాలికల్లో నవధాన్యాలు పోసి అంకురార్పణ చేయనున్నారు. మంగళవారం సాయంత్రం ధ్వజారోహణం అనంతరం స్వామివారు పెద్దశేష వాహనంపై తిరువీధుల్లో విహరిస్తారు. నిత్యం ఉదయం 8 గంటలకు, సాయంత్రం 7 గంటలకు వాహనసేవలు నిర్వహించనున్నారు. 19న రాత్రి గరుడ సేవను అర్ధరాత్రి వరకూ కొనసాగిస్తారు. 20న సాయంత్రం స్వర్ణ రథోత్సవం, 22న ఉదయం రథోత్సవం, సాయంత్రం అశ్వవాహనంతో వాహనసేవలు ముగియనున్నాయి. 23న ఉదయం 6 గంటల నుంచి పుష్కరిణిలో చక్రస్నానం ఉంటుంది. బ్రహ్మోత్సవాల దృష్ట్యా ఈ నెల 15 నుంచి 23 వరకు ఆర్జిత సేవలైన అష్టదళ పాదపద్మారాధన, తిరుప్పావడ, కల్యాణోత్సవం, ఊంజల్, సహస్రదీపాలంకార సేవలను తితిదే రద్దుచేసింది. వీఐపీ బ్రేక్ దర్శనాలను ప్రొటోకాల్ పరిధిలో ఉండి, స్వయంగా వచ్చేవారికి పరిమితం చేసింది. వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులు, ఎన్ఆర్ఐలు, దాతలకు ప్రత్యేక దర్శనాలను రద్దు చేసింది.

### గవర్నర్‌కు తితిదే ఆహ్వానం

తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు రావాలని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు తితిదే ఆహ్వానం పలికింది. ఈవో ముద్దాడ రవిచంద్ర, వేద పండితుల బృందం శనివారం విజయవాడలోని లోక్‌భవన్‌లో గవర్నర్‌ను కలసి బ్రహ్మోత్సవాల వివరాలను తెలిపింది. ఆహ్వాన పత్రికను గవర్నర్‌కు ఈవో అందజేశారు. వేద పండితులు వేదాశీర్వచనం ఇచ్చారు.

# కొత్తగా 100 బీసీ కాలేజీ హాస్టళ్ల ఏర్పాటు



హైదరాబాద్: రాష్ట్రంలో బీసీ రక్షణ చట్టాన్ని తీసుకొస్తామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని రాజ్యసభ సభ్యులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య తెలిపారు. అసెంబ్లీలో ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డితో సమావేశమై బీసీలకు సంబంధించిన పలు సమస్యలను సీఎంకు వివరించి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో బీసీ రక్షణ చట్టం తీసుకురావాలని కోరగా ఈ అంశంపై సీఎం సానుకూలంగా స్పందించారని, ఇందుకు సంబంధించి ప్రతిపాదనలు తయారు చేయాలని బీసీ సంక్షేమ శాఖను ఆదేశించినట్లు చెప్పారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో, పలు జిల్లా కేంద్రాల్లో బీసీ విద్యార్థులకు హాస్టళ్లలో సీట్లు సరిపోక ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో 100 బీసీ కాలేజీ హాస్టళ్లు, 120 బీసీ గురుకులాలు మంజూరు చేయాలని ,హాస్టల్ విద్యార్థుల కోసం శాశ్వత భవనాలు నిర్మించాలని విజ్ఞప్తి చేయగా కొత్తగా 100 బీసీ కాలేజీ హాస్టళ్లకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆదేశించారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను సాధ్యమైనంత త్వరగా దశలవారీగా చెల్లిస్తామని చెప్పారన్నారు. సీఎంను కలిసిన వారిలో బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు జి.మల్లేష్‌యాదవ్, నీలా వెంకటేష్, జిల్లపల్లి అంజి, సి.రాజేందర్, పర్లగోర్ల మోడీ రాందేవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ అభ్యర్థుల
# కెరీర్లు మీకు అపహాస్యంగా మారాయా?



అమరావతి: డీఎస్సీ నియామక ప్రక్రియలో ఏడు దశల వెరిఫికేషన్ అంటే ఇదేనా చంద్రబాబు అంటూ వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రశ్నించారు. ఏపీ మెగా డీఎస్సీ స్కామ్‌పై ఆయన మరోసారి 'ఎక్స్' వేదికగా చంద్రబాబు కూటమి ప్రభుత్వాన్ని నిలదీశారు. 'వెరిఫికేషన్.. నో, నో.. ఏడు దశల వెరిఫికేషన్' అంటూ జగన్ ఎక్స్‌లో పోస్టు చేశారు. ఏడు దశలు పెట్టినా.. ఒక్కో కేసులో ఒక్కో అంశం బయటపడుతోందని చెప్పారు. వెరిఫికేషన్ పేరుతో అసలేం సాధించారంటూ నిలదీశారు. ఉపాధ్యాయ అభ్యర్థుల భవిష్యత్తుతో చంద్రబాబు సర్కారు ఆటలాడుతోందని అన్నారు. ఉపాధ్యాయ అభ్యర్థుల కెరీర్లు మీకు అపహాస్యంగా మారాయా అని మండిపడ్డారు. 'ముందుగా విజేతల జాబితాను పరిశీలిస్తే అందులో సంబంధిత అభ్యర్థుల పేర్లు కనిపించడంలేదు. ఆ తర్వాత ఖోఖో అధికారులను సంప్రదిస్తే.. సర్టిఫికెట్ నకిలీదని తేలింది. అంతేకాకుండా నాగార్జున యూనివర్సిటీని సంప్రదిస్తే.. అసలు ఆ క్రీడా కార్యక్రమమే జరగలేదని తేలింది. ఇలాంటి పరిస్థితుల్లో డీఎస్సీ ప్రక్రియను న్యాయమైన, పారదర్శకమైన నియామక ప్రక్రియగా ఎలా పిలుస్తారు? ఇది స్కామ్ కాదా? దీనికి మీరు నైతిక బాధ్యత వహించరెందుకు' అని వైఎస్ జగన్ సీఎం చంద్రబాబుని నిలదీశారు.

స్కిల్ కేసులో క్లీన్‌చిట్ అని చెప్పడం దౌర్భాగ్యం

చంద్రబాబు చేసిన స్కామ్‌లో ఆయనే సొంతంగా క్లీన్ చిట్ ఇప్పించుకుని భుజాలు ఎగరేసుకుయిటున్నారని వైఎస్ జగన్ పేర్కొన్నారు. ఆయన శనివారం ఫేస్‌బుక్‌లో ఈమేరకు ఒక పోస్టు చేశారు. 'అధికారులను బెదిరించి తనపై ఉన్న కేసుల పని పూర్తి చేసుకుని క్లీన్‌చిట్ అని చెప్పడం దౌర్భాగ్యం. తన మీద కేసులు తానే కొట్టేయించుకుంటున్నాడు. ఎందుకంటే అవన్నీ నిజం కాబట్టి. ఇప్పుడు కూడా డీఎస్సీ కేస్‌ని నిర్వీర్యం చేసే పని చేస్తున్నాడు. అయినా స్కిల్ కేసులో తనకు క్లీన్‌చిట్ వచ్చిందని చెప్పుకోవడం ఎంతటి దౌర్భాగ్యం' అని వైఎస్ జగన్ ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు.

# 16 మంది నిరుపేద కుటుంబాలకు నిత్యవసర రేషన్ సరుకులు పంపిణీ



మెళియాపుట్టి, శివ సూర్య, సెప్టెంబర్ 13: మెళియాపుట్టి మండల కేంద్రంలో పాతపట్నం శాసనసభ్యులు మామిడి గోవిందరావు ఆదర్శంగా తెలుగుదేశం పార్టీ నాయకుడు ఎరుసు శ్రీనివాసరెడ్డి ఆదివారం 16 మంది నిరుపేద కుటుంబాలకు బియ్యం, కూరగాయలు, నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ప్రతినెల నిరుపేదలకు పంపిణీ చేసే నిత్యవసర సరుకులు భాగంగా వినాయక చవితి సందర్భంగా



మండల కేంద్రంలో ఎరుసు అప్పారావు, అమ్మాయమ్మ ట్రస్ట్ ద్వారా 16 మంది నిరుపేద కుటుంబాలకి నెల రోజులకు సరిపోయిన నిత్యవసర సరుకులు 5 కిలోల బియ్యం, కూరగాయలు, ఉల్లిపాయలు, బంగాళదుంపలు ఒక ప్యాకేజ్ ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎరుసు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... ప్రతి నెల 12 తారీఖున ఇదే విధంగా కుటుంబాలకు ఇవ్వడం జరుగుతుందని తెలియజేశారు. ఇంకా గ్రామంలో ఎవరన్నా నిరుపేద కుటుంబాలు ఉంటే వాళ్లు కూడా ప్రతి నెల ఇస్తామని చెప్పారు. గ్రామ ప్రజలు సహకరిస్తే ఎరుసు అప్పారావు,అమ్మాయమ్మ టెస్ట్ ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్స్ ఎంపిటిసి దుక్క గాంధీ రెడ్డి, ఎల్ అండ్ టి మేనేజర్ రాజేశ్వరరావు, పూర్ణిమ, లిఖిత్ రెడ్డి, రాజు, కృష్ణారెడ్డి, ఇంద్రసేన తదితరులు పాల్గొన్నారు.

# శిష్టకరణం సంఘం ఆధ్వర్యంలో వినాయక విగ్రహాల పంపిణీ



మెళియాపుట్టి, శివసూర్య, సెప్టెంబర్ 13: వినాయక చవితి పండగను పురస్కరించుకుని పాతపట్నం మండల శిష్టకరణం సంఘం ఆధ్వర్యంలో వినాయక విగ్రహాలు, పూజా కథా పుస్తకాలను భక్తులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ.. భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సవాల నడుమ చవితి వేడుకలను జరుపుకోవాలని ఆకాంక్షించారు. ధార్మిక భావాన్ని పెంపొందించేందుకు శిష్టకరణం సంఘం ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో శిష్టకరణం సంఘం అధ్యక్షుడు రావాడ అశోక్ కుమార్, కార్యదర్శి బెహరా నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు రఘుపాత్రుని తులసీరావు పట్నాయక్, సహాయ కార్యదర్శి తోనంగి రాజశేఖర్ పట్నాయక్, కార్యవర్గ సభ్యులు వెంకుమహంతి మహేష్, గుణుపూర్ ప్రసాద్ పట్నాయక్, డబ్బీరు వినోద్, బెహరా శ్రీను, డబ్బీరు ఉదయ్ కుమార్, జడ్డుమహంతి రాంబాబు, బెహరా శ్రీనివాసరావు, నాగభూషణరావు, పి.శ్రీనివాసరావు, డబ్బీరు స్వాతి తదితర సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

# 20 జిల్లాల క్రీడాకారులతో ఘనంగా ఏపీ సబ్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ సాఫ్ట్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్

---విజేతలకు బహుమతులు అందజేసిన ఎమ్మెల్యే మామిడి గోవిందరావు



మెళియాపుట్టి, శివ సూర్య ,సెప్టెంబర్ 13 : పాతపట్నం కేంద్రంలోని అక్షర స్కూల్ ఆవరణలో




నిర్వహించిన "ఏపీ సబ్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ సాఫ్ట్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్, స్టేట్ టీం సెలక్షన్ ట్రయల్స్--2026" బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో పాతపట్నం శాసనసభ్యులు మామిడి గోవిందరావు పాల్గొని విజేతలకు బహుమతులు, పతకాలు అందజేశారు. ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్‌లోని 20 జిల్లాల నుంచి క్రీడాకారులు, క్రీడాకారిణులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. సబ్ జూనియర్ స్థాయిలో నిర్వహించిన ఈ పోటీలు యువ క్రీడాకారుల్లో క్రీడా స్ఫూర్తిని, పోటీతత్వాన్ని పెంపొందించేలా సాగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎంజీఆర్ విజేతలను అభినందిస్తూ, క్రీడల్లో ప్రతిభ కనబరుస్తున్న యువతను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అన్నారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి పాతపట్నం ప్రాంతానికి, ఆంధ్రప్రదేశ్‌కు మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా సాఫ్ట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీరామ్ రమణ ,నిర్వాహకులు, కోచ్‌లు, క్రీడా ప్రతినిధులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.




# ఒండరఫుల్ లైఫ్... విత్ స్లో డ్రైవింగ్!

అమరావతి,13/9/26:
ప్రమాణం చేస్తున్నాను....
అసాయం:
వేగంగా వెహికల్
నడుపుతూ ఎవ్వరి ప్రాణాలకు అపాయం
తలపెట్టను.
ఆస్పత్రి :
నా దేహనికి గాయములయ్యేలా
నా వాహనాన్ని వేగంగా నడపను.
ఇళ్లు:
నా ఇంటి వార్కి నేనెంతో
అవసరం..గనుక, వాహనాన్ని నెమ్మదిగా
నడుపుతాను.
ఈరోజు:
నా గమ్యస్థానాన్కి
పనులన్నీ త్వరగా ముగించుకొని





నెమ్మదిగా చేరుకోడాన్కి ప్రయత్నిస్తాను.
ఉద్రేకం:
పెంచే ఎటువంటి పదార్థాలు గాని నేను
సేవించనని ప్రమాణం చేస్తున్నాను.
ఊపిరి:
పొగొట్టే వేగం నేను
వదిలివేయుచున్నాను.
ఎన్నిసార్లు:
చెప్పినా హెల్మెట్ ధరించని జనం! నేను
మాత్రం హెల్మెట్ ధరిస్తాను.
ఏవిధంగా.....
చూసినా రోడ్ యాక్సిడెంట్ మరణాలే
ఎక్కువ గనుక నేను ట్రాఫిక్ రూల్స్
జాగ్రత్తగా పాటిస్తాను.
ఐనా...
కాలం కలిసిరాక పోతే ప్రమాదం
తప్పదు! గనుక ఊరికే చిన్న పనికి పెద్ద
పనికి బండి తీయను,
కాళ్ళకు పని అప్పచెప్పుతాను.
ఒశీదరఫ్ఫుల్ లైఫ్.....
విత్ స్లో డ్రైవింగ్
ఓన్లీ వన్స్...
లైఫ్ ఈజ్ ఓన్లీ.. వన్స్.
ఔరా! ప్రయాణం గమ్యానికి గాని....
నరకానికి కాదు కదా!....
అందరూ.... బాగుండాలి
ఆహా....
అందులో నేనుండాలి.....
అని సామాజిక శాస్త్రవేత, కవి,
రచయిత,

**డా. మేడపాటి ఇమ్మానుయేల్ తెలిపారు**

# ఉచితంగా మట్టి విగ్రహాల పంపిణీలో ఎమ్మెల్యే ఎంజీఆర్ --పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకులే మేలు



మెళియాపుట్టి, శివ సూర్య సెప్టెంబర్ 13: పాతపట్నం శాసనసభ్యులు అసెంబ్లీ ప్రివిలేజ్ కమిటీ మెంబర్ మామిడి గోవిందరావు ఉచితంగా మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు మట్టి వినాయక విగ్రహాలను స్వయంగా అందజేశారు. మట్టి వినాయక



విగ్రహాలను వినియోగించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు, మన సంప్రదాయాలను కాపాడుకోవచ్చని ఎమ్మెల్యే తెలిపారు. రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారయ్యే విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితం కాకుండా ప్రతి ఒక్కరూ పర్యావరణహిత మట్టి వినాయకులను పూజించాలని ఆయన సూచించారు. వినాయక చవితి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో, పర్యావరణహితంగా నిర్వహించాలనే ఉద్దేశంతో ఉచితంగా మట్టి వినాయక విగ్రహాల పంపిణీ చేపట్టడం అని ఆయన పేర్కొన్నారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మట్టి వినాయకులను స్వీకరించాలని, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

# 5 వేల వినాయక ప్రతిమలు, వ్రత కథా పుస్తకాలు పంపిణీ చేసిన ---- హిరమండలం టీడీపీ టౌన్ అధ్యక్షులు పోతురాజు శ్రీధర్



మెళియాపుట్టి, శివ సూర్య, సెప్టెంబర్ 13: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని హిరమండలం మేజర్ పంచాయతీ పరిధిలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. పాతపట్నం శాసనసభ్యులు మామిడి గోవిందరావు ఆదేశాల మేరకు టీడీపీ హిరమండలం టౌన్ అధ్యక్షులు పోతురాజు శ్రీధర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా హిరమండలం మేజర్ పంచాయతీ పరిధిలోని పాత హిరమండలం నుంచి నౌగూడ వరకు వివిధ ప్రాంతాల్లో ప్రజలకు 5 వేల వినాయక వ్రత కథా పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. అలాగే భక్తులకు వినాయక విగ్రహాలను కూడా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....వినాయక చవితి సందర్భంగా ప్రతి ఇంటిలో భక్తిశ్రద్ధలతో వ్రతాన్ని ఆచరించడంతో పాటు, గణనాథుడి మహిమ, పురాణ విశేషాలు, వ్రత విధానాలను ప్రజలకు చేరువ చేయాలనే ఉద్దేశంతో ఈ పుస్తకాలను పంపిణీ చేస్తున్నట్లు టీడీపీ టౌన్ అధ్యక్షులు పోతురాజు శ్రీధర్ తెలిపారు. పాత హిరమండలం నుంచి నౌగూడ వరకు వివిధ ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి భక్తులకు వ్రత కథా పుస్తకాలను అందజేశారు. వినాయకుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని శ్రీధర్ ఆకాంక్షించారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులకు వ్రత కథా పుస్తకాలు, వినాయక విగ్రహాలను ఉచితంగా అందజేయడం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. భక్తి, సంప్రదాయాలను ప్రోత్సహిస్తూ చేపట్టిన ఈ కార్యక్రమాన్ని అభినందించారు.

# రైతులందరూ ఆర్థికంగా ఎదగాలి.

సర్పంచ్ వజ్రమ్మ తిమ్మప్ప.



గట్టు (శివసూర్య ) ఆధునిక, సాంకేతికత, వ్యవసాయం దిశగా ప్రతి రైతు వ్యవసాయంతో పాటు వాణిజ్య పంటల వైపు అడుగులు వేసి అత్యుత్తమ దిగుబడులు సాధించి, సమాజంలో ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. మామిడి తోట ప్రారంభోత్సవంనికి హాజరైన మాచర్ల సర్పంచ్ బి.వజ్రమ్మ తిమ్మప్ప. వార్డ్ మెంబర్ ఉప్పలపాటి భీమేష్ మామిడి మొక్కలు నాటే కార్యక్రమనికి సర్పంచ్ హాజరయ్యారు. రైతులందరూ మామిడి తోట మోసంబి తోట దానిమ్మ తోట బొప్పాయి తోట ల వైపు మొగ్గు చూపాలని రైతులుకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్ బి. లోకేష్. జి. వీరేష్. రాముడు కుర్వ తిమ్మప్ప. తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి దిశగా గ్రామాలు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి.



గట్టు (శివ సూర్య )గట్టు మండలం లింగాపురం గ్రామంలో గద్వాల ఎమ్మెల్యే శ్రీ బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి 30లక్షలతో ఆహార ధాన్యాల నిల్వ కేంద్రం(వ్యవసాయ గోదాం) మరియు 10లక్షలతో మహిళా సమాఖ్య భవనాలకు భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే ని లింగాపురం గ్రామస్తులు, గ్రామ సర్పంచ్ శశికళ సునంద ఘనంగా స్వాగతం పలికి ఆహ్వానించి శాలువాతో సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడతూ,మన రైతులు ఎంతో కష్టపడి పండించిన ధాన్యాన్ని సరైన సమయంలో సరైన చోటు నిల్వ చేసుకునేందుకు ఎలాంటి నిల్వ స్థలాలు లేక ఎంతో నష్టాలను చూస్తున్నామని. అకాల వర్షాల వల్ల ఆరుగాలం కష్టపడి పండించిన పంటను ఎక్కడ నిల్వ చేయాలో తేలిక గ్రామాల్లో సరైన స్థలం లేకుండా ఉండడం వల్ల ఎంత నష్ట పోతామో రైతులుగా మనందరికీ తెలుసు అందుకు ప్రతి గ్రామంలో గోదాముల నిర్మాణం ఎంతో అవసరం ఉందని. గోదాంలు ఉంటే నిల్వ సౌకర్యాలు పెరగడం ద్వారా రైతులు తమ పంటను వెంటనే తక్కువ ధరకు అమ్మాల్సిన పరిస్థితి తగ్గుతుంది. ధాన్యాన్ని సురక్షితంగా నిల్వ చేసుకునే అవకాశం పేరుగుతుందని. మన గ్రామ మహిళల కోసం ఎంతో ముఖ్యమైన మహిళా సమాఖ్య భవనాన్ని ప్రారంభించుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, స్వయం సమృద్ధిగా ఎదగడానికి ఈ భవనం ఒక వేదికగా ఉపయోగపడుతుంది. మహిళా సంఘాలు కేవలం పొదుపు, రుణాలకే పరిమితం కాకుండా.. చిన్నతరహా పరిశ్రమలు, స్వయం ఉపాధి, వ్యవసాయ అనుబంధ కార్యకలాపాలు, నైపుణ్యాభివృద్ధి వంటి రంగాల్లో ముందుకు సాగాలని వారికంటూ ఒక సముదాయక ప్రదేశం ఉండాలని మహిళా సమాఖ్య భవనాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలొ లింగాపురం గ్రామ సర్పంచ్ శశికళ సునంద, గట్టు మాజీ ఎంపీపీ విజయ్ కుమార్, మాజీ గ్రంధాలయ సర్పంచ్ జంబూ రామన్ గౌడ, మాజీ సర్పంచ్ సూర్యాగౌడ్, లింగాపురం గ్రామస్తులు పాల్గొన్నారు.

## వినాయక చవితి సందర్భంగా ప్రజావాణి రద్దు..

వాజేడు ఎంపీడీవో కృపాకర్



వాజేడు, సెప్టెంబర్ 13( మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ కార్యాలయం యందు ఈ రోజు జరిగే 'ప్రజావాణి వినాయక చవితి పండుగ సందర్భంగా రద్దు చేయబడిందని ఎంపీడీఓ కృపాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి వచ్చే సోమవారం నుండి ప్రజావాణి కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.

## బోగత జలపాతంలో సందడి చేసిన పర్యాటకులు



వాజేడు సెప్టెంబర్ 13చీకుపల్లి బోగత జలపాతం ఆదివారం పర్యాటకులతో కిటకిటలాడింది.వారాంతపు సెలవు దినం కావడంతో సమీప ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. పైనుంచి జాలువారుతున్న జలపాతం ప్రకృతి అందాలను తిలకిస్తూ, తమ సెల్‌ఫోన్‌లలో సెల్ఫీలు దిగుతూ పర్యాటకులు అలరించారు. అంతేకాకుండా, జలపాతం కింద ఉన్న నీటి కొలనులో ఉత్సాహంగా స్నానాలు చేస్తూ ఆహ్లాదకరంగా సమయాన్ని గడిపారు.

## ఆదివాసీల ఆత్మఘోష మహాధర్నాను జయప్రదం చేయండి

జీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం సాయి



వాజేడు సెప్టెంబర్ 13(?వెంకటాపురం ఆర్ అండ్ బీ విశ్రాంతి భవన ఆవరణలో గోండ్వానా సంక్షేమ పరిషత్ ములుగు జిల్లా అధ్యక్షుడు పూనెం ప్రతాప్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం సాయి పాల్గొని మాట్లాడారు.ఈ నెల 18న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద జరిగేఆదివాసీల ఆత్మఘోష మహాధర్నాను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పక్క రాష్ట్రాల్లో ఓసీ, బీసీలుగా ఉన్న లంబాడీలు తెలంగాణలో మాత్రం ఎస్టీలుగా చెల్లుబాటవుతున్నారని, 1970లో ఓటు బ్యాంకు రాజకీయం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం వారిని ఎస్టీ జాబితాలో చేర్చిందని విమర్శించారు. కాబట్టి తెలంగాణలో లంబాడీల ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలను వెంటనే రద్దు చేయాలని, ఎస్టీ జాబితా నుండి వారిని తొలగించేందుకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే 5వ షెడ్యూల్ ప్రాంతాల్లో 1/70 చట్టాన్ని పక్కాగా అమలు చేస్తూ ఏజెన్సీ భూములకు రక్షణ కల్పించేలా శాసనసభ లో తీర్మానం చేయాలన్నారు.ఈ సమావేశంలో నాయకులు తాటి రాజేష్, భీమయ్య, లక్ష్మయ్య, రమేష్, సుక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

## మట్టపల్లి శ్రీ లక్ష్మి నరసింహా స్వామి దేవస్థానాన్ని సందర్శించిన ప్రముఖ నృత్య ఇంద్రజాల కళాకారుని రవళి

ఘనంగా స్వాగతం పలికిన ఆలయ అర్చకులు ప్రధాన పూజారులు





మఠంపల్లి, సూర్యాపేట జిల్లా (మఠంపల్లి మండలం చౌటుపల్లి గ్రామానికి చెందిన లెట్ గుంటి సత్యనారాయణ ధనమ్మల మనవరాలు గుంటి వెంకటేశ్వర్ల కుమార్తె శ్రీమతి రవళి కెనడా దేశంలో ఎమ్మెస్ పూర్తి చేసుకుని సురవం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీలో ఎంఏ కూచిపూడి అభ్యసిస్తూ ఇటీవల కెనడా దేశంలో స్థిరపడి విధులు నిర్వహిస్తున్న అభిలాషను వివాహమాడినా రవళి చిన్ననాటి నుండి కళ ల మీద మక్కువతో బాలనాటిగా ప్రేక్షకుల మనాన్నలు పొందుతూ నటించిన సినిమాలు చక్రం, ప్రయత్నం, అల్లరి బుల్లోడు, నచ్చావులే తెలుగు సినిమాలతో పాటుగా జూన్ ఆర్ తమిళ్ మూవీ ప్రముఖ హీరోయిన్ జ్యోతిక నటించిన మూవీ లో బాలనటిగా ఆమె పాత్రను నటించి ప్రేక్షకుల మండలం పొందారు అంతేకాకుండా 2018 సంవత్సరంలో కెనడాలో నిర్వహించిన మిస్ తెలుగు కెనడాగా ఎంపికయ్యారు మఠంపల్లి మండల కేంద్రంలోని శ్రీ మట్టపల్లి లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానానికి విచ్చేసిన సందర్భంగా పూజారులు ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికి ఘనంగా సత్కరించి ఆశీర్వదించారు ఈ కార్యక్రమంలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ విజేత నట ప్రపూర్ణ రంగస్థల కళాకారులు డాక్టర్ గుంటి పిచ్చయ్య వెంకటేశ్వర్లు సాయికుమార్ పద్మావతి ప్రధాన అర్చకులు పద్మనాభచార్యులు ఇతర పూజలు పాల్గొనరు అమృత శ్రీ వర్షిని సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షులు ప్రముఖ గాయకుడు ఆర్గనైజర్ స్వర శ్రీ డా, పెట్టు కొండలరావు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు

## స్థానిక సంస్థల ఎన్నికలపై కౌతాళం టిడిపి కార్యాలయం నందు టీడీపీ కార్యకర్తల సమావేశంఏర్పాటు



కౌతాళం మండలం సెప్టెంబర్ 13.మంత్రాలయం ఇంచార్జ్ ఎన్ రాఘవేంద్ర రెడ్డి. జిల్లా ఉపాధ్యక్షులు చూడి ఉలిగయ్య. మరియు మండలటీడీపీ అధ్యక్షులు సురేష్ నాయుడు. ఆదేశాల మేరకు రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలపై దిశా నిర్దేశ కార్యక్రమాన్ని నిర్వహించిన కౌతాళం సొసైటీ చైర్మన్ అల్లూరి వెంకటపతి రాజు. త్వరలో రాబోవు ఎంపీటీసీ, జడ్పిటిసి మరియు సర్పంచ్ ఎన్నికలపై కౌతాళం టిడిపి కార్యాలయంలో నాయకులకు మరియు కార్యకర్తలకు ఎన్నికల రిజర్వేషన్లపై మరియు ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అందరూ కలిసికట్టుగా పనిచేసి రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలు అన్ని స్థానాలు కూటమి పార్టీలు కైవసం చేసుకోవాలని తెలిపారు. పార్టీ కోసం పనిచేసిన వారికి తప్పకుండా పదవులు వస్తాయని ప్రజలకు కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి మరియు సంక్షేమాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ అల్లూరు వెంకటపతి రాజు, మండల ఉపాధ్యక్షులు కురువ వీరేష్, మాజీ ఎంపిటిసి చౌదరి బసవ, టౌన్ ప్రెసిడెంట్ డాక్టర్ రాజానందు, రైతుమండల అధ్యక్షుడు గిరి, ముఖన్న, రమేష్, సుల్తాన్ సుభాన్, గొట్టయ్య, లింగేష్, నబి, అమ్ముమలి, రేవన్న, నాగరాజు పాల్గొన్నారు.

# కొండ ప్రాంత ప్రజలకు ఎమ్మెల్యే సుజనా చౌదరి భరోసా

సురక్షిత ప్రాంతాలకు తరలింపునకు చర్యలు

బాధితులకు టిడ్కో, జేఎన్ఎన్‌యూఆర్ఎం ఇళ్లపై హామీ

కలెక్టర్‌తో చర్చించి పునరావాసానికి ఎమ్మెల్యే చొరవ

పిచ్చింగ్ కూలిన ప్రాంతంలో కూటమి నేతల పరిశీలన

ప్రజల భద్రతే ప్రథమ ప్రాధాన్యత..



విజయవాడ, సెప్టెంబర్ 13,:భారీ వర్షాల నేపథ్యంలో కొండ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల భద్రతపై పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి ప్రత్యేక దృష్టి సారించారు.కొండ అంచుల్లో బలహీనంగా ఉన్న పాత పిచ్చింగ్‌లు, ఇరుకైన ప్రాంతాల్లో ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న నివాసాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే.. ముంపు, కొండచరియలు, పిచ్చింగ్ కూలిపోయే ముప్పు ఉన్న కుటుంబాలను ముందుగానే గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకుంటున్నారు.ఫ్రైజర్ పేట లోని,జగపిల్ల



రామారావు వీధి, రామాలయం సమీపంలోని కొండ ప్రాంతంలో భారీ వర్షాలకు పాత పిచ్చింగ్ జారిపడింది. కొండ అంచున నిర్మించిన పిచ్చింగ్ బలహీనపడి కూలడంతో రాళ్లు కిందనున్న ఇళ్లవైపు జారిపడ్డాయి. అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆదేశాలతో ఆయన కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, 49వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు బడుగు వెంకన్న, జనసేన అధ్యక్షుడు చినబాబు తదితర కూటమి నేతలు ఘటనా ప్రాంతాన్ని పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.ప్రత్యామ్నాయ విజ్ఞప్తికొండ ప్రాంతంలో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ప్రమాదకర పరిస్థితుల దృష్ట్యా ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. ఈ సమస్యను ఇప్పటికే ఎమ్మెల్యే సుజనా చౌదరి దృష్టికి తీసుకెళ్లినట్లు నేతలు తెలిపారు. ప్రజల ఇబ్బందులను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.పునరావాసంపై ఎమ్మెల్యే సుజనా ప్రత్యేక చొరవప్రమాదకర పరిస్థితుల్లో కొండ ప్రాంతాల్లో నివసిస్తున్న పేద కుటుంబాల భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్న ఎమ్మెల్యే సుజనా చౌదరి.. అవసరమైన కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు చేపట్టారు. బాధిత కుటుంబాలకు టిడ్కో లేదా జేఎన్ఎన్‌యూఆర్ఎం ఇళ్లు అందించే అంశంపై కలెక్టర్‌తో మాట్లాడి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రమాదం ముప్పు ఉన్న కుటుంబాలకు ప్రభుత్వం తరపున శాశ్వత పరిష్కారం చూపే దిశగా చొరవ తీసుకుంటున్నారు.

ప్రమాదం జరిగే వరకు వేచి ఉండొద్దు

కొండ ప్రాంతాల్లో ఇరుకైన ప్రదేశాలు, బలహీనమైన పిచ్చింగ్‌లకు ఆనుకుని ఉన్న ఇళ్లను అధికారులు క్షేత్రస్థాయిలో గుర్తించాలని సూచించారు. ప్రమాదం జరిగే అవకాశం ఉన్న నివాసాల్లోని కుటుంబాలను ముందుగానే సురక్షిత ప్రాంతాలకు లేదా పునరావాస కేంద్రాలకు తరలించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. బాధిత కుటుంబాలకు పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయం పూర్తిగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.వర్షాల సమయంలో కొండ ప్రాంత ప్రజల ప్రాణాలకు ఎలాంటి ముప్పు వాటిల్లకుండా అధికారులతో నిరంతరం సమన్వయం చేస్తూ, సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవడమే లక్ష్యంగా ఎమ్మెల్యే సుజనా చౌదరి వ్యవహరిస్తున్నారని కూటమి నేతలు తెలిపారు.పరిశీలనలో ఏఈ రాజేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దుర్గారావు, ప్లానింగ్ సెక్రటరీ యాకూబ్, వీఆర్ఓ సహేన, టీడీపీ నేత లంకా శ్రీనివాస్, సుజనా మిత్రా కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# తుర్లపాడు అభివృద్ధికి మరో ముందడుగు..

రూ.3.84 కోట్లతో రహదారి పునర్నిర్మాణానికి శంకుస్థాపన..

గ్రామీణ రహదారుల అభివృద్ధికి పెద్దపీట

-- ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



చందర్లపాడు , సెప్టెంబర్ 13, : తుర్లపాడు గ్రామంలో గ్రామీణ రహదారి అభివృద్ధికి మరో కీలక అడుగు పడింది. చందర్లపాడు నుంచి కంచల గ్రామానికి తుర్లపాడు మీదుగా వెళ్లే రహదారి పునఃనిర్మాణ పనులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కూటమి నేతలు, అధికారులు, స్థానిక ప్రజలతో కలిసి శంకుస్థాపన చేశారు.పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో రూ.384.00 లక్షలు (రూ.3.84 కోట్లు) అంచనా వ్యయంతో ఈ రహదారి పునఃనిర్మాణ పనులు చేపట్టనున్నారు. గ్రాంట్ ద్వారా నిధులు సమకూరుతున్నాయి. తుర్లపాడు మీదుగా చందర్లపాడు--కంచల గ్రామాలను కలిపే ఈ



రహదారి పునర్నిర్మాణంతో ప్రజల రాకపోకలు మరింత సులభతరం కావడంతో పాటు, రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు తరలించేందుకు, విద్యార్థులు, ఉద్యోగులు, గ్రామీణ ప్రజలు ప్రయాణించేందుకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి రానుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ, ప్రజలకు అవసరమైన రహదారులను గుర్తించి దశలవారీగా అభివృద్ధి చేస్తోందని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు.నందిగామ నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి మెరుగైన రహదారి సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు నిధులు తీసుకువచ్చి పనులను వేగంగా పూర్తి చేయడమే తమ ధ్యేయమని సౌమ్య తెలిపారు. "కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి పనులు మాటల్లో కాదు.. చేతల్లో కనిపిస్తున్నాయి. ప్రతి గ్రామానికి మెరుగైన రహదారి, ప్రతి కుటుంబానికి మెరుగైన మౌలిక సదుపాయాలు అందించడమే మా లక్ష్యం" అని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో లాల్ బహదూర్ లెఫ్ట్ కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కోట వీరబాబు,కూటమి నేతలు, స్థానిక ప్రజానీకం పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పర్యావరణాన్ని కాపాడుదాం మట్టి వినాయకుని పూజిద్దాం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బలరాం యాదవ్

శేరిలింగంపల్లి ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బలరాం యాదవ్

శ్రీరామ్నగర్ కాలనీవాసులకు మట్టి వినాయకులను అందజేసిన చేసిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బలరాం యాదవ్



శేరిలింగంపల్లి నియోజకవర్గం సెప్టెంబర్ 14 శేరిలింగంపల్లి నియోజకవర్గం కొండాపూర్ శ్రీరాంనగర్ లో పర్యావరణ కాపాడుదాం మట్టి వినాయకుని పూజిద్దాం కాంగ్రెస్ సీనియర్ నాయకులు బలరాం యాదవ్ అన్నారు పర్యావరణాన్ని రక్షిస్తూ మట్టి వినాయకుడిని నిష్టగా తొమ్మిది రోజులు పాటు పూజించి గంగాజలంలో నిమజ్జనం చేయడం మన ఆచారం , కానీ ఇప్పుడు చాలా వరకు ఎవరు కూడా మట్టి వినాయకులను పెట్టడం మానేశారు పర్యావరణాన్ని రక్షిస్తేనే మన భావి భవిష్యత్తు తరానికి అందించే విధంగా ఉంటుందని అని చెప్పుకొచ్చారు, అనంతరం తన వంతు కృషితో ఎకో ఫ్రెండ్లీ గణేష్ పేరుతో చిన్నపిల్లలకు వినాయకుడిని అందజేసిన బలరాం యాదవ్. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి ప్రజలందరికీ మరోసారి వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేసిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బలరాం యాదవ్ . ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## ఖైరతాబాద్ వినాయకుడి మాదిరిగా 'దూండీ' గణపతి

రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



విజయవాడ, సెప్టెంబర్ 13, ఖైరతాబాద్ వినాయక ఉత్సవాలకు మాదిరిగా దూండీ గణేశ్ సేవా సమితి ఆధ్వర్యంలో ఏపీలో వినాయక నవరాత్రి ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత కొనియాడారు. సంప్రదాయాలను పాటిస్తూ, పర్యావరణానికి ఎటువంటి హానీ కలగకుండా ఆరేళ్ల నుంచి 72 భారీ అడుగుల భారీ వినాయక విగ్రహం ఏర్పాటు చేస్తూ వస్తున్న దూండీ గణేశ్ సేవా సమితి సభ్యులను అభినందించారు. ప్రజలంతా మట్టి వినాయకులనే పూజించాలని, పర్యావరణ పరిరక్షణలో భాగమవ్వాలని మంత్రి సవిత పిలుపునిచ్చారు. విజయవాడలోని విద్యాధర పురంలో దూండీ గణేశ్ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న 72 అడుగుల చముఖ వరసిద్ధి మహా గణపతి భారీ విగ్రహం ఆగమన వేడుకను మంత్రి సవిత ఆదివారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నవ్యాంధ్ర ప్రదేశ్ ఏర్పడిన తరవాత ఆరేళ్ల నుంచి భారీ ఎత్తున వినాయక నవరాత్రి ఉత్సవాలను దూండీ గణేశ్ సేవా సమితి నిర్వహిస్తూ వస్తోందన్నారు. ఖైరతాబాద్ వినాయక ఉత్సవాలను ధీటుగా విజయవాడలో నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా మంత్రి సవిత... దూండీ గణేశ్ సేవా సమితి మహిళా ప్రతినిధులతో కలిసి



కోలాటం ఆడి సందడి చేశారు. సంప్రదాయ నృత్యకళాకారిణులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, కార్పొరేషన్ చైర్మన్లు దూండీ రాకేశ్, పేరేపి ఈశ్వరరావు, సినీ నిర్మాత, ప్రముఖ పారిశ్రామికవేత్త అంబికా కృష్ణ, ఇతర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అరిలోవ పోలీస్ స్టేషన్ గంజాయి అక్రమ రవాణా విక్రయంపై కేసు నమోదు.ఆరిలోవ సి ఐ శ్రీనివాస్.



విశాఖపట్నం సెప్టెంబర్ -13జిల్లా ఇంచార్జ్.అరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై అందిన విశ్వసనీయ సమాచారంతో పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి చర్యలు చేపట్టారు. 13 న మధ్యాహ్నం సుమారు 12.00 గంటల సమయంలో విమ్స్ హాస్పిటల్ సమీపంలో అరిలోవ ఎస్ఐ శ్రీ కృష్ణ ఆధ్వర్యంలో సీటీఎఫ్ ( సిటీ టాస్క్ ఫోర్స్ స్టాఫ్)సిబ్బంది మరియు పోలీసు సిబ్బంది కలిసి వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద ఉన్న ప్యాకెట్లను మధ్యవర్తుల సమక్షంలో తనిఖీ చేయగా ఎండిన గంజాయి ఆకులు, పుష్పాలు మరియు కాండాలు లభించాయి. ఆరిలోవ సి ఐ శ్రీనివాస్ కేసు ను దర్యాప్తు చేస్తున్నారు.ఈ కేసులో ఏ1 బొబ్బిలి దినేష్ కుమార్ దినేష్, ఏ2 కదుపుట్ల సందీప్, ఏ3 మోకా రిషేంద్ర, ఏ4 తోట యశ్వంత్ మరియు ఏ5 ధనలను అరెస్ట్ చేశారు. ఏ 6 ధన, ఏ7 కట్టా రాము, ఏ 8 సుంకర గౌతమ్ పరారీలో ఉన్నట్లు గుర్తించి, వారి కోసం గాలింపు చర్యలుకొనసాగుతున్నాయిఅరెస్టు చేసిన నిందితుల వద్ద నుండి మొత్తం 3.055 కిలోల గంజాయి, ఒక యాక్టివా స్కూటీ మరియు 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు అరిలోవ పోలీస్ స్టేషన్ క్రైమ్ నం.261/2026, సెక్షన్ 20(బి).ఐ ఐ (ఎ) ఆర్డబ్ల్యు 8(సి)ఎన్ డి పి ఎస్ యాక్ట్, 1985 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. నిందితులలో కొందరికి గతంలో కూడా గంజాయి ఇతర నేరాలకు సంబంధించిన కేసులు ఉన్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. గంజాయి అక్రమ రవాణా, విక్రయం మరియు వినియోగానికి పాల్పడే వ్యక్తులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అరిలోవ పోలీసులు తెలిపారు.

## విశాఖలో సెప్టెంబర్ 22న సహజ వ్యవసాయ రైతు సదస్సు పోస్టర్ ను ఆవిష్కరించిన,

ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీయన్ మాధవ్.



విశాఖపట్నం, సెప్టెంబర్ -13 జిల్లా ఇంచార్జ్.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కిసాన్ మోర్చా, గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల పరస్పర సహకార సంఘం సంయుక్త ఆధ్వర్యంలో విశాఖపట్నంలో సెప్టెంబర్ 22, మంగళవారం ఉదయం 10 గంటలకు గాదెరాజు ప్యాలెస్ , లైసెన్స్ బే కాలనీ, బీచ్ రోడ్డులో జరుగుతున్న సహజ వ్యవసాయ రైతు సదస్సు నిర్వహణ పోస్టర్ ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు పీవీయన్ మాధవ్ ఆవిష్కరించారు.ఈ సదస్సులో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన మహిళా రైతులు, మహిళా పారిశ్రామికవేత్తలు పాల్గొననున్నారు. ముఖ్యంగా మహిళా రైతులు సహజ వ్యవసాయం ద్వారా సాధిస్తున్న విజయాలు, ఎదుర్కొంటున్న సమస్యలు, మార్కెటింగ్ అవకాశాలు, విలువ ఆధారిత ఉత్పత్తులు, మహిళలకు అందుబాటులో ఉన్న ఉపాధి మరియు పారిశ్రామిక అవకాశాలపై చర్చించేందుకు రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు . ఈ సందర్భంగా పీవీయన్ మాధవ్ మాట్లాడుతూ, సహజ వ్యవసాయ రంగంలో మహిళల భాగస్వామ్యం మరింత పెరగాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా రైతులు, మహిళా పారిశ్రామికవేత్తలకు ఇటువంటి సదస్సులు పరస్పర అనుభవాలను పంచుకునేందుకు, కొత్త అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం ద్వారా రైతులకు ఆర్థికంగా ప్రయోజనం కలగడంతో పాటు, ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం అందించే అవకాశం ఉంటుందని అన్నారు.అనంతరం మట్టి వినాయక విగ్రహాలను వితరణ చేసి, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అశోక్ కుమార్, సురేంద్ర మోహన్, జ్యోతి, కృష్ణ, సాయిబాబు, మురళి, విరజశ్రీ, ఐశ్వర్య,సరిత,నాగలక్ష్మి,ఆదిలక్ష్మి,సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## కుప్పం మున్సిపాలిటీలో 64 పోలింగ్ కేంద్రాల తుది జాబితా విడుదల

32 వార్డులకు రెండు చొప్పున కేంద్రాల ఖరారు.. ఎన్నికల ప్రక్రియలో మరో కీలక ముందడుగు



కుప్పం: సెప్టెంబర్ 13 కుప్పం పురపాలక సంఘం పరిధిలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల తుది జాబితా విడుదలైంది. పురపాలక సంఘం పరిధిలోని మొత్తం 32 వార్డులకు 64 పోలింగ్ కేంద్రాలను ఖరారు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు ఆదివారం వెల్లడించారు. ప్రతి వార్డుకు రెండు పోలింగ్ కేంద్రాల చొప్పున కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం, సీడీఎంఏ, చిత్తూరు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాల ఖరారు ప్రక్రియను చేపట్టినట్లు కమిషనర్ తెలిపారు. ఇప్పటికే ముసాయిదా జాబితాపై ప్రజల నుంచి అభ్యంతరాలు, సూచనలు స్వీకరించిన అనంతరం తుది జాబితాను సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. తుది జాబితాను కుప్పం మున్సిపల్ కార్యాలయంలో ప్రజల పరిశీలనకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అలాగే పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండేలా వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు తదితర ప్రాంతాలకు పంపించినట్లు వెల్లడించారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో పోలింగ్ కేంద్రాల తుది జాబితా కీలకమైన అంశమని అధికారులు పేర్కొన్నారు. ఓటర్లు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రం ఎక్కడ ఉందో ముందుగానే తెలుసుకోవాలని సూచించారు. ఎన్నికల రోజున ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ఓటర్లు తమ పోలింగ్ కేంద్ర వివరాలను ముందుగానే పరిశీలించుకోవాలని కోరారు. కుప్పం పురపాలక సంఘం పరిధిలో 32 వార్డులకు సంబంధించి 64 పోలింగ్ కేంద్రాలు ఖరారు కావడంతో స్థానిక ఎన్నికల ప్రక్రియ మరింత వేగం పుంజుకున్నట్లు అధికారులు తెలిపారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను దశలవారీగా చేపట్టేందుకు అధికార యంత్రాంగం సిద్ధమవుతున్నట్లు వెల్లడించారు.

## పోలవరం నియోజకవర్గ ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు



వెలేరుపాడు : 13, సెప్టెంబర్ ::పోలవరం నియోజకవర్గ ప్రజలందరికీ వినాయక చవితి పర్వదిన శుభాకాంక్షలను పోలవరం ఎమ్మెల్యే చిర్రి. బాలరాజు తెలియజేశారు. విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి, సౌభాగ్యాలు నిండాలని ఆయన ఆకాంక్షించారు.వినాయక చవితి సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసే వినాయక మండపాల వద్ద భక్తులు, నిర్వాహకులు తగిన జాగ్రత్తలు పాటించాలని ఎమ్మెల్యే సూచించారు. ముఖ్యంగా మండపాల వద్ద భద్రతా చర్యలు చేపడుతూ, పోలీసు శాఖ అధికారులు సూచించే నిబంధనలు, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు.వినాయకుని నిమజ్జనం సమయంలో కూడా ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించి, పోలీసు, అధికారుల సూచనలకు సహకరించాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు విజ్ఞప్తి చేశారు.వినాయకుని ఆశీస్సులతో ప్రతి కుటుంబం సుఖశాంతులతో, ఆనందంగా ఉండాలని కోరుకుంటున్నాను. అందరూ భక్తిశ్రద్ధలతో, సురక్షితంగా వినాయక చవితి పండుగను జరుపుకోవాలి అని ఎమ్మెల్యే తెలిపారు.

# కుప్పం ఏఎస్పీగా బొడ్డు హేమంత్ బాధ్యతల స్వీకరణ అక్రమాలు, అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి

మత్తు పదార్థాల వినియోగం,

బహిరంగ మద్యం సేవనంపై కఠిన చర్యలు

వినాయక చవితి మండపాలకు

తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలి



కుప్పం: సెప్టెంబర్ 13 ( కుప్పం ఏఎస్పీగా బొడ్డు హేమంత్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బంది ఆయనకు సాదర స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఏఎస్పీ హేమంత్ స్థానిక పాత్రికేయులతో మాట్లాడారు. కుప్పం ప్రాంతంలో శాంతిభద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తామని ఆయన తెలిపారు. స్థానికంగా అక్రమాలు, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడంలో పోలీసులతో పాటు ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే నేరాలను సమర్థవంతంగా నియంత్రించగలమని చెప్పారు. ముఖ్యంగా మత్తు పదార్థాల వినియోగం, విక్రయాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఏఎస్పీ స్పష్టం చేశారు. యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా అడ్డుకోవడంతో పాటు, వాటి అక్రమ రవాణా, వినియోగానికి పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా వ్యవహరించే వారిపైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించనున్నట్లు బొడ్డు హేమంత్ తెలిపారు. నేరాల నియంత్రణ, అనుమానాస్పద కార్యకలాపాల గుర్తింపు, ప్రజల భద్రత కోసం అందుబాటులో ఉన్న సాంకేతిక వనరులను సమర్థవంతంగా వినియోగిస్తామని చెప్పారు. ప్రాంతంలో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు, మత్తు పదార్థాల విక్రయాలు, అక్రమ కార్యకలాపాలు జరుగుతున్నట్లు ప్రజలకు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ఆయన కోరారు. ప్రజలు అందించే సమాచారాన్ని ప్రాధాన్యతతో పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోలీసులకు సమాచారం అందించడంలో ప్రజలు ఎలాంటి సంకోచం చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

### వినాయక చవితి ఉత్సవాలకు నిబంధనలు పాటించాలి

త్వరలో జరగనున్న వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో మండపాల నిర్వాహకులకు ఏఎస్పీ పలు సూచనలు చేశారు. కుప్పం ప్రాంతంలో వినాయక మండపాలను ఏర్పాటు చేసేవారు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ సంబంధిత అధికారుల నుంచి ముందస్తు అనుమతులు పొందాలని సూచించారు. వినాయక మండపాల ఏర్పాటుకు అనుమతుల కోసం నిర్వాహకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇప్పటికే మండపాలు ఏర్పాటు చేసేందుకు నిర్ణయించుకున్నప్పటికీ అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోని నిర్వాహకులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఉత్సవాల సందర్భంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మండపాల ఏర్పాట్లు ఉండాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. పోలీసుల సూచనలు, ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ వినాయక చవితి వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఏఎస్పీ బొడ్డు హేమంత్ సూచించారు. ప్రజలు, ఉత్సవ కమిటీలు పోలీసు శాఖకు సహకరిస్తే వినాయక చవితి ఉత్సవాలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంతంగా నిర్వహించుకోవచ్చని ఆయన తెలిపారు. కుప్పం ప్రాంతంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ నిరంతరం అప్రమత్తంగా ఉంటుందని ఏఎస్పీ స్పష్టం చేశారు..

# సిల్వర్ జూబ్లీ వేడుకల్లో కుప్పం ఇంజినీరింగ్ కళాశాల

అమిగోస్ లైవ్ బ్యాండ్ కచేరీతో సందడిగా

మారిన కళాశాల ప్రాంగణం




కుప్పం: సెప్టెంబర్ 13 కుప్పం ఇంజినీరింగ్ కళాశాల 25 ఏళ్ల విద్యా ప్రస్థానాన్ని పురస్కరించుకుని నిర్వహించిన సిల్వర్ జూబ్లీ వేడుకలు శనివారం రాత్రి కళాశాల ప్రాంగణంలో ఘనంగా జరిగాయి. పావు శతాబ్దంగా విద్యా రంగంలో కళాశాల అందిస్తున్న సేవలు, సాధించిన విజయాలను స్మరించుకుంటూ నిర్వహించిన ఈ వేడుకలు విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందిలో నూతనోత్సాహాన్ని నింపాయి. సిల్వర్ జూబ్లీ వేడుకల్లో భాగంగా నిర్వహించిన అమిగోస్ లైవ్ బ్యాండ్ కచేరీ--మ్యూజికల్ నైట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. లైవ్ బ్యాండ్ సంగీతంతో కళాశాల ప్రాంగణం హుషారెత్తగా విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని సంగీత కార్యక్రమాన్ని ఆస్వాదించారు. వేడుకల్లో భాగంగా గతంలో నిర్వహించిన కలర్‌ఫుల్ క్రాకర్, షార్ట్ ఫిల్మ్స్, నృత్యం, ఫ్లాష్ మాబ్, క్రికెట్ తదితర పోటీలు, కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, కళాత్మక ప్రతిభ, క్రీడా స్ఫూర్తిని వెలికితీసే ఉద్దేశంతో



ఈ కార్యక్రమాలను నిర్వహించినట్లు కళాశాల ప్రతినిధులు తెలిపారు.

### 25 ఏళ్ల సేవలకు ఘన సత్కారం

కళాశాల ఏర్పాటైన నాటి నుంచి 25 ఏళ్లుగా సంస్థకు సేవలందిస్తున్న ఉద్యోగులను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. సుదీర్ఘకాలంగా కళాశాల అభివృద్ధికి వారు అందించిన సేవలు, అంకితభావం, కృషిని గుర్తించి యాజమాన్యం అభినందించింది. కళాశాల ప్రస్థానంలో ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొంది. గత 25 ఏళ్లలో కుప్పం ఇంజినీరింగ్ కళాశాల విద్యా, సాంకేతిక, సహపాఠ్య రంగాల్లో గణనీయమైన ప్రగతి సాధించిందని కళాశాల ప్రతినిధులు తెలిపారు. న్యాక్ 'ఏ' గ్రేడ్, ఎన్‌బీఏ గుర్తింపు, ఐఎస్ఓ 9001:2015 ధ్రువీకరణ వంటి గుర్తింపులు కళాశాల విద్యా ప్రమాణాలకు నిదర్శనమని పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. కళాశాల చైర్మన్ బి.సి. నాగరాజ్, వైస్ చైర్మన్ ఎన్. సునీల్ రాజ్, సెక్రటరీ ఎన్. సాగర్ రాజ్, ట్రెజరర్ ఎన్. శాంత, ప్రిన్సిపాల్ డా. ఎస్. సుధాకర్ బాబు ఆధ్వర్యంలో సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో అధ్యాపకులు, సిబ్బంది, విభాగాధిపతులు, విద్యార్థులు కీలకపాత్ర పోషించారు. కళాశాల 25 ఏళ్ల ప్రస్థానాన్ని ఘనంగా జరుపుకోవడం ద్వారా గత విజయాలను స్మరించుకోవడంతో పాటు భవిష్యత్తులో మరింత ఉన్నత ప్రమాణాలతో విద్యా రంగంలో ముందుకు సాగేందుకు కొత్త ఉత్సాహం లభించిందని కళాశాల యాజమాన్యం తెలిపింది.

## తూర్పు నియోజకవర్గం లో 500 మట్టి విగ్రహాలు వ్రత కల్ప పుస్తకాలు పంపిణీ

చేసిన జనసేన తూర్పు నియోజకవర్గ ఇన్చార్జ్.విక్రమ్ బాబు రామడుగు.



విశాఖపట్నం సెప్టెంబర్-13( జిల్లా ఇంచార్జ్.వినాయక చవితి పురస్కరించుకొని విశాఖ తూర్పు నియోజకవర్గం విక్రమ్ బాబు రామడుగు చేతుల మీదుగా మట్టి వినాయక విగ్రహ పంపిణీ కార్యక్రమం వైభవంగా జరిగింది, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని సూచించారు, ఈ




కార్యక్రమంలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానని పిఓపి విగ్రహాల వలన పర్యావరణానికి హానికరమని రామడుగు విక్రమ్ బాబు తెలిపారు,500 మట్టి విగ్రహాలు కేవలం 30 నిమిషాలలో పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో పాల్గొన్న జనసేన నాయకుడు ధూళి రఘు,జామి సతీష్ , డాక్టర్ వాకా సునీత , సుధారాణి,సునీత, పవన్ , శ్యాంప్రసాద్, అనిల్, శంకర్ మరియు తెలుగుదేశం నాయకులు ముగడ రాజారావు , ఎర్రాజీ గ, శ్రీను , జ్యోతిర్మయి , అలాగే బిజెపి నాయకులు మధుపాడ సన్యాసిరావు హాజరయ్యారు.

## చినముసిడివాడ బిజెపి విస్తృతస్థాయి సమావేశం



సెప్టెంబర్ 13 అనకాపల్లి జిల్లా పెందుర్తి నియోజకవర్గం, చినముషిడివాడ ( జీవీఎంసీ 95,97 వార్డుల )మండలం బిజెపి విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం ఆదివారం నాడు బిజెపి 95,97వ వార్డుల అధ్యక్షులు చిక్కాల సతీష్ ఆధ్వర్యంలో మండల పదాధికారులతో సమావేశం నిర్వహించారు,ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జీవీఎంసీ 95వ వార్డు మాజీ కార్పొరేటర్ ముమ్మన దేముడు మరియు అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి గొర్లి రాము నాయుడు,మండల సమావేశం ఇన్‌చార్జి,అనకాపల్లి జిల్లా



ఎస్సీ మోర్చా అధ్యక్షులు గొటివాడ సామ్రాట్ కుమార్,మరియు అనకాపల్లి జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ పురిజాల బాలసుబ్రమణ్యం హాజరయ్యారు,ఈ సందర్భంగా మండలం ఇంచార్జి గొటివాడ సామ్రాట్ కుమార్ మాట్లాడుతూ భారత ప్రధాన మంత్రి నరేంద్రమోడీ 13 సంవత్సరాలు గుజరాత్ ముఖ్యమంత్రిగా, 12 సంవత్సరాలు భారత ప్రధానమంత్రిగా పనిచేసి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 17 వరకు నెల రోజులు పాటు సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని తీసుకొని 11 కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.కార్యక్రమంలో బిజెపి 95,97వ వార్డుల యువ మోర్చా అధ్యక్షులు ఆదిరెడ్డి దేముడు బాబు, బిజెపి 95,97వ వార్డుల ఓబిసి మోర్చా అధ్యక్షులు శ్రీధర్, ఉపాధ్యక్షులు పిడివి. ప్రసాద్, కెవిఆర్,వడ్డాది విద్యాసాగర్,ప్రధాన కార్యదర్శి రాపర్తి దుర్గా ప్రసాద్, సోషల్ మీడియా కన్వీనర్ కెవి. సంతోష్ యాదవ్, కార్యదర్శులు భవాని, గౌరీ కుమారి,మణి, కొప్పల రామ ప్రభాకర్, ఉమామహేశ్వరరావు, ట్రెజరర్ తవిటి నాయుడు,పెంటారావు, కృష్ణ మూర్తి,గోవిందరావు,గంగరాజు,దార రామారావు,చిరంజీవి,శివ,తదితరులు పాల్గొన్నారు,

# జైజై గణేశా... జయమునివ్వు గణేశా!

గణపతిని వేదాలు కొలిచాయి, ఉపనిషత్తులు కీర్తించాయి, పురాణాలు ప్రస్తుతించాయి. బ్రహ్మజ్ఞానాన్నీ, విష్ణుతత్వాన్నీ, శివశక్తినీ తనలో ఇముడ్చుకున్న త్రిమూర్తి అంశగా ప్రకటించాయి. హృదయ నేత్రాలతో దర్శించుకోగలిగితే... ఆ గుజ్జురూపం వెనకాల ఉన్న విరాట్ స్వరూపం మనకు గోచరం అవుతుంది. బానపొట్టలో బ్రహ్మాండాలు దర్శనమిస్తాయి. ఏకదంతం అనేక ఉదంతాల్ని వివరిస్తుంది.

ఒక్కో పురాణం ఓ జన్మవృత్తాంతాన్ని తెలియజేస్తుంది. ఒక్కో ఉపనిషత్తూ ఓ పేరుతో సంబోధిస్తుంది. అనేకానేక కల్పాల్లో, మహాయుగాల్లో, యుగాల్లో... కైలాసంలో పార్వతమ్మ చేతి పసుపు బొమ్మగా, ఆశ్రమవాటికలో మునిదంపతుల ముద్దుల బిడ్డగా, అంతఃపురంలో వీరాధివీరుడైన రాచబిడ్డగా – రకరకాల నేపథ్యాలతో జన్మించాడు మహాగణపతి. ఆయా అవతార లక్ష్యాల్లో భాగంగా... విఘ్నాధిపతి హోదాలో అసురసంతతిని అణచివేశాడు. జ్ఞానకారకుడిగా సజ్జనులకు భక్తివైరాగ్యాలను ప్రసాదించాడు. ఎన్ని జన్మలెత్తినా, ఆది నుంచీ ఆయనది ఒకటే రూపం... గజముఖం, వక్రతుండం! గణపతి... విష్ణువులో మహావిష్ణువు, శివుడిలో పరమశివుడు, బ్రహ్మలో పరబ్రహ్మ! ఒక్క త్రిమూర్తులేనా, సమస్త దేవతల్లోనూ ఆయన అంశ గోచరిస్తుంది. మొత్తంగా ముక్కోటిమందిలోనూ అధివసిస్తాడు కాబట్టే, పూజాదికాల్లో 'సురాధ్యక్షాయ నమః' అని స్తోత్రిస్తాం. 'నిర్మలుడూ, నిర్వికల్పుడూ, గుణాతీతుడూ, అంతకుమించి నాలుగు వేదాలనూ తన పొట్టలో నింపుకున్నవాడూ...' అంటూ ఆదిశంకరుల 'భుజంగ ప్రయాతం' గణాధిపతిని అక్షర స్వరూపంగా అభివర్ణించింది. గజాసుర సంహార ఘట్టంలో గణనాథుడి లోంచి ఏడుకోట్ల మంది గణపతులు పుట్టుకొచ్చి రాక్షస సైన్యంతో పోరాడారు. శత్రు సంహారం పూర్తి కాగానే, మళ్లీ ఆయనలో విలీనమైపోయారు. వేదం కూడా సప్తకోటి మంత్రాల సమాహారమేనని అంటారు. అలా, చతుర్వేదాలకూ గణపతే అధిపతి అని అర్థమైపోతుంది.

ఏ దేవుణ్ని అర్చించాలన్నా, ముందుగా విఘ్నేశ్వరుడిని పూజిస్తాం. విఘ్నేశ్వరుడిని కొలిచేందుకు మాత్రం ఎవరి అనుమతీ అక్కర్లేదు. అతను స్వతంత్రుడు. పూర్వం గణనాథుడిని సర్వవ్యాపకుడిగా, సర్వోన్నతుడిగా, సర్వశక్తిమంతుడిగా కొలిచిన 'గాణపత్యం' అఖండ భారతంలో ఓ వెలుగు వెలిగింది. అప్పట్లో ఐదారు గణపతి మతాలు ప్రాచుర్యంలో ఉండేవి. కాలక్రమంలో అవన్నీ అద్వైతంలో కలిసిపోయాయి. సిద్ధి–బుద్ధి... గణపతి ముద్దుల దేవేరులనీ, ఆ ఇద్దరి ద్వారా 'క్షేముడు', 'లాభుడు' అనే బిడ్డలు జన్మించారనీ చెప్పడమూ ప్రతీకాత్మకమే. సిరిసంపదలూ విజయవైభవాలూ... ఒకటేమిటి, ఏ లక్ష్యమైనా సమ్యక్ బుద్ధితోనే సిద్ధిస్తుంది. సిద్ధి–బుద్ధి అంతిమ ఫలాలు... క్షేమలాభాలే! విఘ్నేశ్వరుడికి సంబంధించి... వ్రతకల్పానికి ఎక్కని దివ్యగాథలూ, నామావళులు కొనియాడని సద్గుణాలూ అష్టాదశ పురాణాల్లో అనేకం తారసపడతాయి.

## కృష్ణ స్వరూపుడు!

నల్లనివాడు, పద్మనయనంబులవాడు, కృపారసంబు పై జల్లెడువాడు... వక్రతుండ మహాకాయుడు కూడా. 'బ్రహ్మ వైవర్త పురాణం' గణపతిని శ్రీకృష్ణుడి అవతారంగా ప్రకటించింది. ఒకానొక సందర్భంలో, పార్వతీదేవి సంతాన భాగ్యం కోసం గోలోకవాసి అయిన కృష్ణ పరమాత్మను ప్రార్థించింది. భక్తిశ్రద్ధలతో ఏడాదిపాటూ పుణ్యకవ్రతాన్ని ఆచరించమని సలహా ఇచ్చాడు కృష్ణస్వామి. అంతే శ్రద్ధగా ఆ నియమాల్ని పాటించిందామె. చివర్లో బ్రహ్మ స్థానంలో నిలబడి నిర్విఘ్నంగా వ్రతాన్ని జరిపించిన సనత్కుమారుడికి అపార సంపదల్ని దక్షిణగా సమర్పించబోయింది. కానీ, ఆయన స్వీకరించలేదు. 'భోగభాగ్యాలతో నాకేం పనీ? పరమశివుణ్ని దానంగా ఇస్తేనే తీసుకుంటాను' అని పట్టుబట్టాడు. కాదంటే, ఆ మహర్షి ఎక్కడ ఆగ్రహిస్తాడో అని... అయిష్టంగానే ఈశ్వరుడిని అప్పగించింది. కానీ ఆ తర్వాత, భర్త ఎడబాటును భరించలేక ఆత్మార్పణకు సిద్ధపడింది. ఆ సమయంలో శ్రీకృష్ణుడు ధైర్యం చెప్పాడు.

ఓ సోదరుడిలా ఊరడిస్తూ, ఏదైనా వరం కోరుకోమని అడిగాడు. 'కృష్ణా! ఎలా అయినా నా భర్త నాకు దక్కేలా చూడు. నువ్వే బిడ్డగా జన్మించి మాతృత్వ భాగ్యాన్నీ ప్రసాదించు' అని వేడుకుంది పార్వతీదేవి. చిరునవ్వుతో అనుగ్రహించాడు శ్రీకృష్ణుడు.



సనత్కుమారుడిని ఒప్పించి శివుడికి విముక్తి ప్రసాదించాడు. పార్వతీదేవి ఆనందంగా భర్తను కైలాసానికి తీసుకెళ్లింది. సరిగ్గా భోజన సమయంలో ఓ వృద్ధుడు 'అమ్మా! ఆకలేస్తోంది. అన్నం పెట్టు!' అంటూ గడప ముందు నిలబడి యాచించాడు. దాక్షాయణి వంటింట్లోకి వెళ్లి భక్ష్యభోజ్యాలను తీసుకొచ్చేలోపు అతను ద్వారం దగ్గర కనిపించలేదు. 'అయ్యో! అతిథికి భోజనం పెట్టలేకపోయానే...' అని బాధపడిపోయిందామె. అంతలోనే 'జగన్మాతా! వచ్చినవాడు సాక్షాత్తూ శ్రీకృష్ణుడే. ఆ నారాయణుడి అంశే పసిబిడ్డగా నీ ఇంట కాలుపెట్టింది' అని పలికింది అశరీరవాణి. అన్నట్టుగానే, బంగారపు ఊయలలో సింగారాల శిశువు కేరింతలు కొడుతూ కనిపించాడు. ఆ అమ్మ ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. కొంతకాలం తర్వాత, పార్వతీపరమేశ్వరులు ముక్కోటి దేవతలకు బ్రహ్మాండమైన విందు ఇచ్చారు. అందరితోపాటే శనీశ్వరుడూ వెళ్లాడు. అతని వక్రదృష్టి కారణంగా, పసివాడి తల ఛిద్రమైపోయింది. దీంతో, తల్లి మనసు తల్లడిల్లింది.



పార్వతీదేవి

పుత్రశోకాన్ని తీర్చడానికి, ఉత్తరం దిశగా తలపెట్టి నిద్రపోతున్న ఏనుగు తలను తెచ్చి అచేతన శరీరానికి అతికించాడు కృష్ణభగవానుడు. మళ్లీ ఆయువు పోసుకున్న ఆ బాలకుడికి తన కౌస్తుభమణిని కానుకగా ఇచ్చాడు. వెళ్తూ వెళ్తూ 'నా అంతటివాడివి అవుతావు!' అని మనసారా ఆశీర్వదించాడు. ఆ శ్రీకృష్ణాంశ సంభూతుడు శుక్లపక్ష చంద్రుడిలా దినదిన ప్రవర్ధమానం చెందాడు. కాలక్రమంలో గణాధిపత్యం వహించాడు. విపత్తుల నుంచీ విఘ్నాల నుంచీ ముల్లోకాలనూ రక్షించాడు.

## గీతాచార్యుడు!

ఒకానొక సందర్భంలో గణేశుడు గీతాచార్యుడి పాత్రనూ పోషించాడు. వరేణ్యుడనే పాలకుడికి ధర్మ సూక్ష్మాలను బోధించాడు. అదే 'గణేశ గీత'గా సుప్రసిద్ధమైంది. ఆ సమయానికి వరేణ్య మహారాజు తీవ్ర నిస్పృహలో ఉన్నాడు. తనలోని అహంకారాన్ని వదిలించమని రెండు చేతులూ జోడించి గణపతిని ప్రార్థించాడు. 'యోగులు సుఖదుఃఖాలకు అతీతంగా జీవిస్తారు. హృదయంలో పరమాత్మను ప్రతిష్ఠించుకుని... అనునిత్యం తపోస్థితిలోనే ఉంటారు. నువ్వు కూడా ఆ మార్గాన్నే ఎంచుకో. మరో గుహ్యమైన విషయాన్ని చటటబుతాను, శ్రద్ధగా విను. సృష్టి–స్థితి–లయలన్నీ నా అధీనంలోనే ఉంటాయి. నన్ను ఏ వికారాలూ అంటుకోవు. నేను నాశరహితుడిని కూడా' అంటూ తన విరాట్ రూపాన్ని దర్శింపజేశాడు. మట్టినీ బంగారాన్నీ, మిత్రుడినీ శత్రువునూ, రాజునూ పేదనూ... సమబుద్ధితో చూడాలని హితవు పలికాడు. తన ప్రబోధతో వరేణ్యుడి మనసును తొలిచేస్తున్న సందేహాలన్నీ తీర్చేసి, అతడిని ఆధ్యాత్మిక లక్ష్యం దిశగా నడిపించాడు. ఈ వృత్తాంతంలోని వరేణ్యుడు ఎవరో కాదు, ఆ కల్పంలో గణపతికి తండ్రి. తన బిడ్డ ఏనుగు ముఖంతో పుట్టడంతో, సమాజానికి భయపడి అడవుల్లో వదిలేసి వచ్చాడా రాజు. పరాశర మహర్షి–వత్సల దంపతులు ఆ కారణజన్ముడిని పెంచి పెద్ద చేశారు. ఆ బాలుడు పసితనంలోనే సింధురుడనే రాక్షసుడిని సంహరించి, ప్రజలకు సుఖశాంతులను ప్రసాదించాడు. ఆ ఘట్టం తర్వాత, వరేణ్యుడు తన తప్పు తెలుచుకున్నాడు. బిడ్డను పితృవాత్సల్యంతో అక్కున చేర్చుకున్నాడు. ఆ సందర్భంగా, ముల్లోకాల సాక్షిగా తనను తాను 'వరేణ్య పుత్ర గణపతి'గా ప్రకటించుకున్నాడు విఘ్నాధిపతి. గణేశుడు స్వతహాగా బంధాల దేవుడు. 'సౌందర్యలహరి'లో గౌరీ తనయుడికి అమ్మతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేస్తూ... తల్లిపాల మీద మక్కువతోనే గణపతి నిత్యబాల్యాన్ని ఎంచుకున్నాడని అంటారు ఆదిశంకరులు. ఆమాటకొస్తే, మూషిక వాహనుడికి అమ్మంటే ఎంత ప్రేమో, నాన్నంటే అంత అనురాగం కూడా. కాబట్టే, పరమేశ్వరుడి నిజ నివాసమైన కాశీక్షేత్రంలో లెక్కలేనన్ని గణపతి ఆలయాలు కనిపిస్తాయి. నిత్య సంచారి అయిన నాన్నను ఆ బిడ్డడు ప్రతి వీధిలోనూ పలకరిస్తాడు. కాశీ యాత్రికులు సాక్షి గణపతి సమక్షంలో హాజరు వేసుకోకపోతే, యాత్రాఫలం సిద్ధించనట్టే. ఆ ప్రాచీన నగరాన్ని అసురుల నుంచి రక్షించి, కాశీరాజుకు కానుకగా ఇచ్చింది కూడా విఘ్నేశుడే.



## ప్రకృతి దైవం

అడవిలోని ఏనుగు... తల, కలుగులోని ఎలుక... వాహనం, నీటిలోని తామరపువ్వు... హస్తభూషణం – ప్రకృతి సౌందర్యాన్ని కుప్పగా పోసినట్టు ఉంటుందా రూపం. పూజా ద్రవ్యాలూ ప్రకృతి వరాలే. గణేశుడి ఉపాసనకు బంగారు, వెండి ప్రతిమలకంటే మట్టి విగ్రహమే శ్రేష్ఠమని చెబుతారు పెద్దలు. ఇంద్రుడి నందనవనం నుంచి తెప్పించిన పారిజాతాలు ఉన్నా సరే, పురోహితులు 'దూర్వాయుగ్మం సమర్పయామి' అంటున్నప్పుడు స్వామిని గరికతో అర్చించాల్సిందే. ఏ ప్రత్యేకతా లేని గడ్డిపోచకు గణపతి పూజలో ఎందుకింత ప్రాధాన్యం? అంటే – గరికకు వాసన ఉండదు, రుచీ ఉండదు. మనిషి కూడా కామక్రోధాలను అధిగమించి, ఏ వాసనలూ అంటని నిర్మోహత్వాన్ని సాధించాలనే సూచన అది. ఓసారి శివపార్వతులు పాచికలాడుతూ, గరిక బొమ్మకు ప్రాణంపోసి మధ్యవర్తిగా పెట్టుకున్నారు. ఆటలో ఏ వివాదం తలెత్తినా, ఆ బొమ్మ శివుడి వైపే మాట్లాడేది. ఏకపక్షంగా వ్యవహరించేది. దీంతో అమ్మవారికి కోపం వచ్చింది. 'నీ వక్రబుద్ధికి తగిన శాస్తి జరగాల్సిందే. నువ్వు వైకల్యం పాలవుతావు' అని తీవ్రంగా శపించింది. అంతలోనే శివుడు జోక్యం చేసుకుని, ఆమె ఆగ్రహాన్ని చల్లార్చాడు. వెంటనే, ఆ తల్లి తన శాపాన్ని సవరించుకుంది. 'గణపతి పూజలో ప్రధాన ద్రవ్యంగా నీ జన్మ సార్థకం చేసుకుంటావు. దాంతోపాటే, నీ వైకల్యమూ మాయమైపోతుంది' అని ఉపశమన మార్గాన్ని బోధించింది. మరో పురాణ కథ ప్రకారం... యముడికి అనలాసురుడనే కొడుకు ఉండేవాడు. అతను అగ్ని స్వరూపుడు. బలగర్వంతో స్వర్గంపైకి దండెత్తాడు. దీంతో, రక్షించమంటూ ఇంద్రుడు వినాయకుడిని ప్రార్థించాడు. వీరగణపతి అనలాసురుణ్ని నిప్పు రవ్వను చేసి మింగేశాడు. మరుక్షణం నుంచీ బొజ్జ గణపయ్య పొట్టలో మంట మొదలైపోయింది. దేవ వైద్యులు ఎన్ని ఔషధాలు అందించినా ఫలితం కనిపించలేదు. దీంతో, పరమశివుడు గరిక కషాయాన్ని తెప్పించి ఇచ్చాడు. వెంటనే, స్వస్థత చేకూరింది. అలా గజాననుడికి ఇష్టమైన పూజా ద్రవ్యంగా మారిపోయింది గరిక. గణపతి పంచభూతాలకు అధినాయకుడు కూడా. అందుకే హేరంభ వినాయకుడికి ఐదు తలలు ఉంటాయి.

విఘ్న స్వరూపుడైన స్వామి రైతులకూ ఇష్టదైవమే. వర్ష రుతువైన భాద్రపదంలో... మృత్తికామూర్తిని పూజించడమూ, లంబోదరుడి చేతుల్లో ధాన్యపు కంకులో చెరుగు గడలో దర్శనమివ్వడమూ ఆ అభిప్రాయానికి బలాన్నిచ్చే అంశాలు. పంటకు నష్టం కలిగించే ఏనుగు, ధాన్యాన్ని మాయం చేసే ఎలుక, ఆ ఎలుకల్ని జడిపించే పాము, గింజల్ని చెరిగే చాట, వంటనీళ్ల తోడే బాన... ఆయన ఆకారాన్నీ, పరివారాన్నీ ఠక్కున గుర్తుకు తెస్తాయి కూడా. ఏ వృత్తి ఉద్యోగాలకూ లేనన్ని విఘ్నాలు సేద్యానికే ఉంటాయి. కాబట్టే, రైతు 'తొలుత అవిఘ్నమస్తనుచు'... గణపతి పూజ తర్వాతే కొత్త పంటలు వేస్తాడు.





## పురాణ పురుషుడు

అనేక పురాణాలకు గణపతి పరోక్ష నాయకుడు. అందులోనూ, మనకు తెలిసిన కథల వెనుక ఉన్న, తెలియని కోణాలనూ పరిచయం చేస్తుంది వ్యాసులవారి 'శ్రీగణేశ పురాణం'. అహల్య–గౌతముల వృత్తాంతంలో.. గౌతమ మహర్షి శాపంతో అహల్య శిలారూపాన్ని ధరించడమూ, ఒళ్లంతా కళ్లతో ఇంద్రుడు కురూపిగా మారిపోవడమూ విన్న విషయాలే. ఆ తర్వాత, శ్రీరాముడి పాదస్పర్శతో అహల్యకు జడత్వం వదిలిపోయింది. అంతకు చాలా ముందే, ఇంద్రుడు గణపతి కటాక్షం కోసం భూలోకంలో ఘోర తపస్సు చేశాడు. ఆ భక్తికి మెచ్చిన గజాననుడు 'త్వరలోనే నీ కష్టాలన్నీ తీరిపోతాయి. నీ పదవి నీకు లభిస్తుంది' అని అభయం ఇచ్చాడు. ఆ తర్వాత కూడా, ఇంద్రుడు తపస్సు చేసిన చోటే 'చింతామణి గణపతి'గా కొలువుదీరాడు. 'శివ పురాణం'లోని కామదహన ఘట్టంలోనూ వినాయకుడు కీలక పాత్రధారే. శివుడి ఆగ్రహానికి బూడిదైపోయిన మన్మథుడు... ఏ రూపమూ లేని స్థితిలో, ఏకాక్షర మంత్రంతో గణపతిని ఉపాసించాడు. ప్రసన్నుడైన స్వామి పది తలలతో దర్శనమిచ్చి, భవిష్యత్ పరిణామాలను ఎరుకపరిచాడు. ద్వాపరలో రుక్మిణీకృష్ణుల ఇంట ప్రద్యుమ్నుడిగా జన్మిస్తావని ధైర్యం చెప్పాడు. 'రామాయణం'లోని అరణ్యవాసంలో సీతారాములకు ఆతిథ్యం ఇచ్చిన అత్రిమహర్షి–అనసూయ దంపతులకు... ఒకానొక కాలంలో ముద్దుల బిడ్డగా జన్మించాడు. రావణబ్రహ్మ శివుడి ఆత్మలింగాన్ని కైలాసం నుంచి భూమి మీదికి తెచ్చినప్పుడు, తానే బాల గోపాలుడి వేషంలో వెళ్లి... ఆ దివ్యలింగాన్ని దశకంఠుడు లంకకు తీసుకెళ్లకుండా విఘ్నాలు సృష్టించాడు. వ్యాస భగవానుడి రాయసకారుడిగా, మహాభారత రచన శరవేగంగా సాగిపోయేలా సహకరించాడు. దశావతారాల్లో ఒకడైన పరశు రాముడిని ఎదిరించిన వృత్తాంతమూ పురాణాల్లో ఉంది. ఓ రోజు పరశురాముడు శివదర్శనానికి వెళ్లాడు. కానీ మహాద్వారం దగ్గరే గణపతి అడ్డగించాడు. దేవదేవుడు విశ్రాంతి తీసుకుంటున్నాడనీ, దర్శనానికి అనుమతి ఇవ్వలేననీ తేల్చి చెప్పాడు. దీంతో పరశురాముడికి కోపం వచ్చింది. వెనకా ముందూ చూడకుండా, తన గొడ్డలితో దాడి చేశాడు. ఆ దెబ్బకు గణపతి రెండు దంతాల్లో ఒకటి ఊడిపోయింది. అయినా, ఉగ్ర గణపతి సహనంతో వ్యవహరించడానికి కారణం... భార్గవరాముడి చేతిలోని పరశు తన తండ్రి ప్రసాదించింది కావడం. ఆ ఆయుధాన్ని ధ్వంసంచేస్తే పరమేశ్వరుడిని ధిక్కరించినట్టు అవుతుందని భావించాడు. మొత్తానికి, పార్వతీదేవి జోక్యంతో గొడవ సద్దుమణిగింది. పరశు రాముడికి గణపతి ఘనత అర్థమైపోయింది.

**'శుక్లాంబరధరం విష్ణుం**
**శశివర్ణం చతుర్భుజం**
**ప్రసన్నవదనం ధ్యాయేత్**
**సర్వవిఘ్నోపశాంతయే'**

...ఎన్ని సమస్యలతో సతమతం అవుతున్నా, గణపతి విగ్రహం ముందు నిలబడి చేతులు జోడించగానే... భక్తుల పెదాలు పువ్వుల్లా విచ్చుకుంటాయి. ఒత్తిడి ధూపంలా గాల్లో కలిసిపోతుంది. దీప ప్రజ్వలన తర్వాత విస్తరించే కాంతిలా, భయాల చీకట్లన్నీ తొలగిపోతాయి. కారణం, అతను చిరునవ్వుల దేవుడు. భండాసుర సంహారం సమయంలో... లలితాదేవి దరహాసంలోంచి జన్మించిన ఆనంద స్వరూపుడు!

## అంతరిక్ష సంకేతాలు

సూర్యోదయానికి ముందు తూర్పు దిక్కున కనిపించే నక్షత్ర సముదాయాలను ఆధారంగా చేసుకుని, పర్వదినాలను ఏర్పరిచారు మహర్షులు. ఆ ప్రకారంగా, భాద్రపద శుద్ధ తదియనాడు సూర్యోదయానికి పూర్వం, ఆకాశంలో త్రికోణాకారంలో ఓ నక్షత్ర సమూహం సాక్షాత్కరిస్తుంది. త్రికోణం.. మాతృమూర్తికి సంకేతం. అందుకే, కొన్ని ప్రాంతాల్లో ఆరోజు గౌరీవ్రతం చేసుకుంటారు. మరునాడు, భాద్రపద శుద్ధ చవితి రోజున అడుగున చిన్న ఎలుకలా, దానిపైన పెద్ద బానలా కనిపించే రెండు నక్షత్ర బృందాలు దర్శనమిస్తాయనీ, ఆ రూపాన్నే ఎలుక వాహనం ఎక్కిన లంబోదర గణపతిగా పెద్దలు నిర్ధారించారనీ వివరిస్తారు వేదపండితులు కుప్పా వేంకట కృష్ణమూర్తి ఓ వ్యాసంలో. వినాయక చవితి నాటికి... చంద్రుడు హస్తా నక్షత్రంలోనో, దానికి దగ్గరగానో ఉంటాడు. హస్తి అంటే ఏనుగు అనే అర్థమూ ఉంది. 'అడవిలోని సింహం సత్రాజిత్తు తమ్ముడైన ప్రసేనుణ్ని చంపుతుంది. ఆ సింహాన్ని జాంబవంతుడు వధిస్తాడు. బాలకా ఏడుపు మానుకో! సూర్యుడు ప్రసాదించిన శ్యమంతకమణి నీదే అవుతుంది' అని స్కాంద పురాణంలోని ఓ శ్లోక సారాంశం. చాంద్రమానం ప్రకారం అది భాద్రపదమే అయినా, సూర్యమానంలో సింహమాసం కిందికే వస్తుంది. ఈ నెలలో భానుదేవుడు బంగారువన్నె కాంతులను ప్రసరిస్తుంటాడు. ఆ ధగధగల కాలసాక్షే శ్యమంతకమణి. ప్రసేనుడు అంటే ఉగ్రుడు, గ్రీష్మకాలానికి ప్రతీక. ఆ ప్రకారంగా, గ్రీష్మం పూర్తయిపోయి సింహరాశి ప్రవేశిస్తోందని అర్థం. నక్షత్రశాస్త్రంలో సప్తర్షి మండలాన్ని భల్లూకమనీ పిలుస్తారు. పంచమినాటికి సింహాన్ని భల్లూకం మింగేస్తుంది. శ్యమంతకమణి కథలోనూ ఇదే జరుగుతుంది. మొత్తంగా వినాయక చవితి... అంతరిక్ష పరిణామాలకూ సాక్ష్యంగా నిలుస్తుంది.

## ఉపనిషత్ వైభవం

'గణానాం త్వా గణపతిమ్'... అంటూ వేదం విఘ్నాధిపతి ముందు చేతులు జోడించింది. 'బ్రహ్మణస్పతి' అంటూ వేదమంత్రాలకు అధిపతిగా సంబోధించింది. అష్టాదశ ఉపనిషత్తుల్లో 'గణపత్యుపనిషత్' ఒకటి. "స్వామీ! నువ్వు జ్ఞాన, విజ్ఞాన, బ్రహ్మమయ రూపానివి. ఈ ప్రపంచం నీ నుంచే ఆవిర్భవించింది. నీలోనే లయం అవుతుంది" అని కీర్తించిందా ఉపనిషత్తు. అంతేకాదు, 'ఏకదంతుడూ, నాలుగు చేతుల్లో పాశ–అంకుశ–వరద–అభయ ముద్రల్ని ధరించినవాడూ, మూషికవాహనుడూ, రక్తవర్ణంలో ప్రకాశించేవాడూ, లంబోదరుడూ అయిన శ్రీమహాగణపతిని ధ్యానించినవారు ధన్యులు" అంటూ రూప వర్ణన కూడా చేసింది. గజముఖాన్ని ఓంకార సంకేతంగా ప్రకటించింది 'గణేశ తాపిన్యుపనిషత్తు'. కాలం విఘ్న రూపమనీ, దానికి అధిపతి... వల్లభేశుడైన గణేశుడేననీ 'వల్లభేశ ఉపనిషత్తు' స్పష్టం చేసింది.

# లేత మనసుకు రీల్స్ షాక్

**ఆన్‌లైన్ షార్ట్స్, రీల్స్‌కు దాసోహమవుతున్న పిల్లలు**
**ఒకదాని వెంట మరొకటి.. గంటలకొద్దీ వీక్షణం**
**రకరకాల కంటెంట్లు.. భావోద్వేగ హెచ్చుతగ్గులు**
**నిద్ర, ఆరోగ్యం, చదువుపై తీవ్ర ప్రభావం**
**వెల్లడిస్తున్న అంతర్జాతీయ అధ్యయనాలు**



షార్ట్స్, రీల్స్.. కంటెంట్ ఏదైనా ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వస్తున్న వీడియోల వీక్షణం ప్రపంచవ్యాప్తంగా చాలా మందికి వ్యసనంలా దాపురించింది. మాట్లాడటాన్ని మినహాయిస్తే ఒకప్పుడు ఖాళీ సమయాల్లో కొద్దిసేపు వెలిగే మొబైల్ 'తెర'.. ఇప్పుడు గంటలకొద్దీ కాంతిని వెదజల్లుతోంది. ఒకదాని వెంట మరొకటిగా ప్రత్యక్షమయ్యే వీడియోలను విడిచి పెట్టకుండా చూసేస్తున్నారు. అయితే పిల్లలు సైతం ఈ వ్యసనం బారిన పడటం ఆందోళన కలిగిస్తోంది. స్మార్ట్ ఫోన్లలో అందుబాటులో ఉండే యూట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ తదితర యాప్‌లలో అప్‌లోడ్ అవుతున్న ఈ తక్కువ నిడివి వీడియోలు చూడటం నిత్యకృత్యంగా మారింది. డ్యాన్సులు, పాటలు, హాస్యం, నేరాలు, ప్రాంక్ (ప్రాక్టికల్ జోక్స్)..ఇలా అంశం ఏదైనా కోట్లాది షార్ట్ వీడియోలు సోషల్ మీడియాను ముంచెత్తుతున్నాయి. వంటలు చేయడం, పర్యాటక ప్రదేశాలు, ప్రపంచ దేశాలను చుట్టేయడం..వీటన్నిటినీ అప్‌లోడ్ చేసేది కొందరైతే, అవన్నీ చూస్తూ మొబైల్ స్క్రీన్ ముందు ఎంత సమయం గడుపుతున్నదీ తెలియనంతగా జనం లీనమై పోతున్నారు. వీటిల్లో చాలా వీడియోలు పిల్లలకు పనికొచ్చేవి కాదు..వారిని ఉద్దేశించి చేసినవీ కాదు. అయినప్పటికీ కోట్లాది మంది పిల్లలు వీటికి అలవాటుపడ్డారు. భారీ వరదలా ముంచెత్తే కంటెంట్ ప్రవాహం వీరి నిద్రకు అంతరాయం కలిగిస్తోంది. అనారోగ్య సమస్యలకు కారణమవుతోంది. చదువులపై ప్రభావం చూపిస్తోంది. స్మార్ట్‌ఫోన్ యూజర్లు ప్రతిరోజూ ప్రపంచవ్యాప్తంగా 40 వేల కోట్ల యూట్యూబ్ షార్ట్స్, ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ వీక్షిస్తున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి.

నియంత్రణ కోల్పోయి..

సాధారణంగా 15ఉ90 సెకన్ల వ్యవధితో ఉండే ఈ చిన్న వీడియోలు మెదడు ఎప్పటికప్పుడు కొత్తదనం కోరుకునేలా రూపొందాయి. స్వైప్ చేసిన ప్రతిసారీ కొత్త వీడియో దర్శనమిస్తుంది. ఇంకేముంది.. స్క్రీన్‌తోనే తెల్లవారుతోంది.. అదే స్క్రీన్‌తో నిద్రలోకి జారుకుంటున్నారు. లక్ష మంది పాలుపంచుకున్న 71 అధ్యయనాలను విశ్లేషిస్తే.. పెద్ద ఎత్తున షార్ట్ వీడియోల వీక్షణంతో స్వీయ నియంత్రణ, పని, చదువుపై శ్రద్ధ తగ్గిందని తేలింది. ముఖ్యంగా నిద్రపై తీవ్ర ప్రభావం పడుతోంది.

నిద్రకు దూరం..

షార్ట్ వీడియోలు చూసే వారు సరిపడా నిద్రకు దూరమవుతున్నారు. చాలామంది పిల్లలు నిద్రకు ఉపక్రమించే ముందు మొబైల్స్‌లో విహరిస్తున్నారు. వేగవంతమైన కంటెంట్‌లో ఉండే భావోద్వేగ హెచ్చు తగ్గులు మెదడుకు ప్రశాంతత లేకుండా చేస్తాయి. నిద్రపోవడం కష్టమవుతుంది. మరో అధ్యయనం ప్రకారం అధికంగా షార్ట్ వీడియోల వీక్షణంతో కొంతమంది టీనేజర్లు పేలవమైన నిద్ర, బిడియం, ఆందోళనకు గురి అవుతున్నట్టు వెల్లడైంది.

హెచ్చరిక లేకుండానే ప్రత్యక్షం

స్వీయ నియంత్రణ విషయంలో చిన్నపిల్లల్లో తక్కువ పరిణతి ఉంటుంది. పైగా చాలావరకు సున్నిత మనసు?కలు. దీంతో త్వరితగతిన భావోద్వేగానికి గురవుతున్నారు. పిల్లలు ఎప్పుడూ చూడకూడని కంటెంట్ సైతం దర్శనమీయడం ప్రమాదానికి కారణం అవుతోంది. పిల్లల ప్రమేయం లేకుండానే వీడియోలు ఒకదాని తర్వాత ఒకటి ఆటోప్లే అవుతుంటాయి. హింసాత్మక, హానికరమైన చాలెంజ్‌లు, లైంగిక కంటెంట్ సైతం తెరపై ప్రత్యక్షమవుతుంటుంది. గంటల నిడివిగల వీడియోలు, సంప్రదాయ సోషల్ మీడియా పోస్ట్‌లకు భిన్నంగా షార్ట్ వీడియోలు ఎటువంటి హెచ్చరిక ప్రదర్శించవు. దీంతో భావోద్వేగ పరంగా సిద్ధం కావడానికి ఎలాంటి అవకాశమూ ఉండదు.

భావోద్వేగాలను ఎదుర్కోవడానికి..

కంటెంట్, సౌండ్‌లో ఆకస్మిక మార్పు, భావోద్వేగపరమైన హెచ్చుతగ్గులు అభివృద్ధి చెందుతున్న మెదడులకు ఇబ్బంది కలిగిస్తుంది. అందరు పిల్లలపై ప్రతికూల మానసిక ప్రభావం చూపనప్పటికీ.. ఆందోళన, శ్రద్ధ వహించడంలో ఇబ్బందులు, భావోద్వేగ అస్థిరత ఉన్నవారు మానసిక స్థితిలో మార్పులకు ఎక్కువగా గురవుతారు. అటెన్షన్ డెఫిసిట్ హైపర్ యాక్టివిటీ డిజార్డర్ (ఏడీహెచ్‌డీ) ఉన్నవారు ప్రధానంగా వేగవంతమైన కంటెంట్ వైపు ఆకర్షితులవుతారు. బెదిరింపులకు గురైన వారు, ఒత్తిడి, కుటుంబ అస్థిరత, పేలవమైన నిద్రతో బాధపడుతున్న పిల్లలు కష్టమైన భావోద్వేగాలను ఎదుర్కోవడానికి రాత్రి సమయంలో షార్ట్ వీడియోలను చూస్తున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి.

నైపుణ్యాలు బలహీనం..

సంబంధాల నిర్మాణం, విసుగును తట్టుకోవడం, అసౌకర్య భావాలను ఎదుర్కోవడం బాల్యంలో నేర్చుకుంటారు. అలాంటిది ఎక్కువగా శీఘ్ర వినోదానికి అలవాటు పడిపోయినప్పుడు.. పిల్లలు కలలు కనడం, ఆటలు, కుటుంబంతో ముచ్చటించడం లేదా వారి సొంత ఆలోచనల్లో విహరించడం వంటి అవకాశాలను కోల్పోతారు. బడి నుంచి ఇంటికి వచి?చన తర్వాత ఖాళీ సమయంలో లేత మనసులు తమను తాము ఉల్లాసపర్చుకోవడం, అంతర్గత దృష్టిని పెంపొందించు కోవడం వంటివి చేయాలి. అది కరువైతే నైపుణ్యాలు బలహీన పడతాయని నిపుణులు చెబుతున్నారు. తల్లిదండ్రులు పిల్లల్ని జాగ్రత్తగా చూసుకోవాలని హెచ్చరిస్తున్నారు.

### తల్లిదండ్రులు ఏం చేయాలి..

నిద్ర, ఆఫ్‌లైన్ కార్యకలాపాలకు ప్రాధాన్యం ఇచ్చేలా చూడాలి. ఆరు బయట క్రీడలు, పఠనం, అభిరుచులను ప్రోత్సహించాలి.  కంటెంట్, ఆన్‌లైన్ అనుభవాల గురించి పిల్లలతో చర్చించి అవగాహన కల్పించాలి. డిజిటల్ ప్రయోజనాలు, స్క్రీన్ వీక్షణ ప్రభావాల గురించి వివరించాలి.

# కర్మ యోగం... కర్తవ్య పాలన



భారతీయ జీవన దర్శనం ప్రకారం ఈ జగత్తంతా దైవమయం. మనం చేసే ప్రతి కర్మను ఆ పరమాత్మకు అర్పించే 'నైవేద్యం'గా భావించాలి. ఉపనిషత్తులు బోధించిన సూత్రం ప్రకారం, కర్మలను చేస్తూనే వాటి ఫలితాలకు అంటకుండా ఉండటమే జీవన ముక్తి. అహంకారాన్ని వీడి, 'నేను కర్తను కాదు, కేవలం ఒక నిమిత్త మాత్రుడను' అనే భావనతో పని చేసినప్పుడు ఆ కర్మకు పుణ్యపాపాలు అంటవు. ఆర్ష ధర్మం ప్రతిపాదించిన అదుతే జీవన వేదాంతం కర్మయోగం. లోకంలో జన్మించిన ప్రతి మానవుడు కర్మ చేయక తప్పదు. అయితే, ఆ కర్మను బంధనంగా మార్చుకోవాలా లేక మోక్ష మార్గంగా మలచుకోవాలా అన్నదే ఇక్కడి అసలైన ప్రశ్న. భగవద్గీతలో క ృష? పరమాత్మ అందించిన 'కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన' అనే దివ్య శ్లోకం మానవాళికి ఒక శాశ్వత దిక్సూచి. పని చేయడంపైనే నీకు అధికారం ఉంది గానీ, ఫలితంపై లేదని చెప్పడం వెనుక లోతైన మనస్తత్వ శాస్త్రం దాగి ఉంది. ఫలితంపై అతిగా ఆశ పెంచుకున్నప్పుడు మనిషిలో ఆందోళన, భయం, అసహనం ప్రవేశిస్తాయి. అదేపనిని దైవ కార్యంగా భావించి చేసినప్పుడు ఆ కర్మ 'యోగం'గా మారుతుంది. ఇది కేవలం సిద్ధాంతం కాదు, నిత్య జీవితంలో అనుసరించదగిన పరమ సత్యం. కర్మయోగం అంటే పలాయనవాదం కాదు, అది సంపూర?మైన క్రియాశీలత. ఒక శిల్పి విగ్రహాన్ని చెక్కుతున్నప్పుడు కేవలం ఆ ప్రతిమ ఎంత ధరకు అమ్ముడవుతుందనే ఆలోచనతో ఉంటే, ఆ శిల్పంలో జీవం ఉట్టిపడదు. అదే శిల్పి తన నైపుణ్యాన్ని పరమాత్మకు అర్పిస్తున్నాననే భావనతో చెక్కితే, ఆ పనిలో ఒక అలౌకికానందం వెల్లివిరుస్తుంది. అలాగే ఒక వైద్యుడు కేవలం ధనం కోసమే చికిత్స చేస్తే అది వ్యాపారం అవుతుంది. అదే వైద్యుడు రోగిలో దైవాన్ని చూస్తూ, తన విజ్ఞానాన్ని ప్రాణదానానికి అంకితం చేస్తే అది పవిత్ర యజ్ఞమవుతుంది. ఫలితం భగవంతుడి నిర?యమని నమ్మి, తన శక్తినంతా చికిత్సపైనే కేంద్రీకరించినప్పుడు ఆ వైద్యుడికి మానసిక ఒత్తిడి ఉండదు. ఈ నిష్కామ బుద్ధి మనిషిని నిరంతరం ఉన్నత స్థితిలో నిలబెడుతుంది. అగ్ని తన ధర్మాన్ని తాను నిర్వర్తించినట్లు, మనిషి తన స్వధర్మాన్ని నిష్కామంగా ఆచరించాలి. ఈ మార్గంలో అత్యంత ముఖ్యమైనది 'ఫలత్యాగం'. అంటే ఫలితాన్ని వదిలేయడం కాదు, ఫలితం వల్ల కలిగే హర్ష విచారాలకు అతీతంగా ఉండటం. విజయం వస్తే పొంగిపోకుండా, అపజయం ఎదురైతే కుంగిపోకుండా ఉండే స్థితి కర్మయోగికి మాత్రమే సాధ్యం. యోగశాస్త్రం బోధించిన ఈ నిష్కామ కర్మ సిద్ధాంతం వ్యక్తిని కర్తవ్యోన్ముఖుడిని చేస్తుంది. చేసే పనిలో దైవత్వాన్ని వెతుక్కున్నప్పుడు ఒత్తిడి మాయమై శాంతి ప్రవహిస్తుంది. ప్రతి క్షణం మన కర్మను ఒక ఆరాధనగా మలుచుకుంటే, ఈ ప్రపంచమే ఒక వైకుంఠమవుతుంది. స్వార్థపు చీకటిని తొలగించి, సేవా భావం అనే జ్యోతిని వెలిగించుకుందాం. సర్వం ఈశ్వరార్పణమస్తు!  నిప్పు నిప్పును కాల్చదు గానీ, దానిపై పడిన వస్తువును కాలుస్తుంది. అలాగే, అహంకారంతో చేసే కర్మలు బంధాలను స ృష్టిస్తే, నిరహంకారంతో చేసే కర్మలు మనసును నిర్మలం చేస్తాయి. సూర్యుడు ప్రతిరోజూ లోకానికి వెలుగును ఇస్తాడు, తనే వెలుగునిస్తున్నాననే అహంకారం ఆయనకు ఉండదు. అటువంటి నిస్వార్థ గుణమే మనల్ని మహోన్నతులుగా తీర్చిదిద్దుతుంది. నిత్య జీవిత సవాళ్లను సాకులు చెప్పకుండా ఎదుర్కోవడం, బాధ్యతలను భారం కాకుండా గౌరవంగా భావించడం కర్మయోగపు అంతరార్థం. ఈ జ్ఞానమే మనల్ని నిరంతరం కర్మపథంలో నడిపిస్తూ, అంతిమంగా ఆత్మానందానికి చేరువ చేస్తుంది.

# ప్రశాంత జీవన సూత్రం

సముద్ర తీరాన నిలబడినప్పుడు ఒక్కొక్కరి స్పందన ఒక్కోలా ఉంటుంది. ఒకరు అలల హోరును చూసి భయపడితే, మరొకరు పాదా లను తడిపే అలల స్పర్శతో పరవశిస్తారు, ఇంకొకరు నీటిపై తేలే రంగురాళ్లను ఏరుకుంటారు. కొందరు విలువైన రత్నాల కోసం లోతుకు వెళ్తారు. తీరాన స్థిరంగా నిలబడి, దేనితోనూ అంటుకోకుండా సముద్ర గమనాన్ని గమనించేవాడే నిజమైన 'ద్రష్ట'. మన ఆలోచనల నుండి మనం విడివడి, వాటిని కేవలం ఒక సాక్షిగా గమనించినప్పుడు, ఆ ఉద్వేగాల తీవ్రత క్రమంగా క్షణించి మనసు ప్రశాంత నిర్మల సాగరమవుతుంది. నదిలో కొట్టుకుపోయేవాడు ప్రవాహ వేగాన్ని కొలవలేడు, తీరాన నిలబడేవాడే దాని లోతును గ్రహించగలడు. జీవితంలో సంభవించే పరిణామాలు కూడా అలల వంటివేబీ అవి మనల్ని తాకవచ్చు గానీ ముంచేయకూడదు. ఈ నిరంతర జాగరూకతే మనల్ని నిలబెడుతుంది. నిశ్చలత్వమే నిత్య సత్యమని గ్రహించినప్పుడే మానవుడు పరిపూర్ణుడు కాగలడు. విశ్వజనీన ధర్మం కేవలం పూజాది క్రతువుల సముచ్చయం కాదుబీ అది అనంతమైన చైతన్య రహస్యాల నిధి. ముండకోపనిషత్తు ఉద్ఘాటించిన 'ద్వా సుపర్ణా సయుజా సఖాయా...' అనే దివ్య మంత్రం మానవ మనస్తత్వానికి ఒక అద్భుత భాష్యం. ఒకే వృక్షంపై నివసించే రెండు పక్షలలో ఒకటి భౌతిక ఫలాలను భుజిస్తూ సుఖదుఃఖాలకు లోనవుతుంటే, రెండవది కేవలం 'సాక్ష'గా వీక్షిస్తూ ఆనందమయంగా ఉంటుంది.  లోకంలోని ద్వంద్వాలను అనుభవించేది ఒక పక్ష అయితే, ఆ అనుభవాన్ని నిర్లిప్తతతో గమనించేది మరో పక్ష. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో, ఒత్తిడి కోరల్లో చిక్కుకున్న ఆధునిక మానవుడికి ఈ సాక్షభావమే అత్యంత ఆవశ్యకమైన సంజీవని. ఆ దివ్య  దృష్టిలోనే జగత్తు అసలైన పరమార్థం నిబిడీకృతమై ఉంది. ఈ నిరంతర ఎరుక కలిగిననాడు మనిషి సామాన్య జీవి నుండి దైవత్వపు అంచులకు చేరుకుంటాడు. జ్ఞానాగ్నితో అజ్ఞానాన్ని దహించి, ఆత్మజ్ఞాన సౌరభాన్ని పొందడమే ఆర్ష సంస్కృతి మనకు బోధించే పరమ రహస్యం. మానవ జన్మ ధన్యమవ్వడానికి ఇటువంటి తాత్విక చింతన ఎంతో అవసరం. భగవద్గీతలో కృష్ణ పరమాత్మ బోధించిన 'అసంగత్వమే' ఈ సాక్షభావం. తామరాకుపై నీటిబొట్టులా



సంసారంలో ఉంటూనే, దేనికీ అంటకుండా ఉండటం ఒక దివ్య కళ. 'నేను కోపంగా ఉన్నాను' అని కాకుండా, 'నా మనసులో కోపం అనే తరంగం ఉద్భవించింది' అని గమనించడం ప్రారంభించిన క్షణమే ఆ వికారం ఆవిరైపోతుంది. ఇది పలాయనవాదం కాదుబీ పరిపూర్ణమైన అవగాహనతో కూడిన ప్రశాంత స్థితి. సుఖం వచ్చినప్పుడు అది ఒక అతిథి అని, దుఃఖం సంభవించినప్పుడు అది ఒక తాత్కాలిక మేఘమని భావించాలి. వైదిక విజ్ఞానం మనకు అందించిన ఈ అమోఘమైన దృక్పథం, వ్యక్తిని సమర్థుడిగా, సమాజాన్ని సలక్షణంగా తీర్చిదిద్దుతుంది. ఎక్కడైతే ద్వేషం ఉండదో, ఎక్కడైతే మమకారపు సంకెళ్లు ఉండవో, అక్కడ నిరతిశయమైన శాంతి విరాజిల్లుతుంది. సాక్షభావంతో జీవించడం నేర్చుకుంటే, ప్రతి రోజూ ఒక ఉత్సవమే, ప్రతి క్షణం ఒక పరమపదమే.

చీకటిని నిందించడం కంటే చిన్న దీపాన్ని వెలిగించడం మేలు అన్నట్లు, కల్లోల ప్రపంచంలో మనశ్శాంతి అనే జ్యోతిని వెలిగించుకుందాం. సర్వం ఆ పరమాత్మ స్వరూపం! లోకాః సమస్తాః సుఖినో భవంతు! మేఘాలు వస్తుంటాయి, పోతుంటాయిబీ ఆకాశం మాత్రం ఎప్పుడూ నిర్మలంగానే ఉంటుంది. మన ఆత్మ ఆ ఆకాశం వంటి నిర్లిప్త స్థితి. ఇటువంటి మానసిక సంస్కారం అలవడినప్పుడు మనిషి ఏ పరిస్థితిలోనూ చెక్కుచెదరని ధైర్యంతో, ప్రశాంతతతో వ్యవహరించగలడు. అంతిమంగా, మన జీవిత నాటకంలో మనం కేవలం పాత్రధారులమే కాదు, ఆ నాటకాన్ని తిలకించే ప్రేక్షకులం కూడా అని గుర్తించడమే పరమ సత్యం. ఈ జ్ఞానమే మనల్ని బంధవిముక్తులను చేసి మోక్షమార్గాన నడిపిస్తుంది. నిష్కామ కర్మ ద్వారానే సిద్ధి కలుగుతుందని పెద్దల మాట.

# తిరగలి చూడాలి!

## ఆధ్యాత్మికథ

ఓ ఉదయం పాండిచ్చేరి పట్టణం నుంచి కారులో ఒక జంట తిరుమల కొండకు దర్శనానికి బయలుదేరింది. వారిది పాండిచ్చేరి స్వంత పట్టణమైనా, ప్రస్తుతం వారు అమెరికాలో నివసిస్తూ ఉన్నారు. దారి మధ్యలో తిరువళ్ళూరు వద్ద కారు పంక్చర్ అయ్యింది. కారును రోడ్డు పక్కన ఆపి టైరు మార్చుకోవడానికి అవస్థలు పడుతూ ఉన్నారు. అదే దారిలో తిరువళ్ళూరు నుంచి తిరుమలకు మరో జంట వెళ్తూ ఉన్నారు. ఆ తిరువళ్ళూరు జంట, పాండిచ్చేరి జంటను చూసి కారు ఆపింది. సమస్య తెలుసుకుని టైరు మార్చడంలో సహాయం చేయసాగారు. మాటల్లో రెండు జంటలూ దేవుని దర్శనానికి తిరుమలకు  వెళ్తున్నట్లు తెలుసుకుని సంతోషపడ్డారు. పాండిచ్చేరి జంట కొంచెం ఒత్తిడితో ఉన్నట్లు గుర్తించింది తిరువళ్ళూరు జంట. దర్శనానికి ఇంకా చాలా సమయం ఉంది కదా, ఎందుకు ఆదుర్దా పడుతున్నారని అడిగింది."మేము దారిలో ఉన్న నారాయణవనం కళ్యాణ వేంకటేశ్వర స్వామి గుడికి వెళ్ళాలి. అక్కడ శ్రీ పద్మావతీ శ్రీనివాసుల దర్శనం చేసుకుని తిరగలి చూసి ఆపైన కొండకు రావాలి" అని సమాధానమిచ్చింది పాండిచ్చేరి జంట. "అవునా... నారాయణవనం అనేది స్వామివారికి కళ్యాణం జరిగిన ప్రదేశమని తెలుసు. కానీ తిరగలి గురించి తెలియదు. అక్కడి తిరగలి అంత విశేషమైనదా?" అని ఎదురు ప్రశ్న వేశారు. "ఎంతో విశేషమున్న తిరగలి అది. తప్పకుండా చూసి తీరాలి. గుడిలోని పద్మావతి అమ్మవారి ఆలయం పక్కన ఉంటుంది. స్వామివారి పరిణయోత్సవ వేడుకల్లో నలుగుపిండి, వడియాల పిండి, పసుపును విసరిన తిరగలి అది. వేల సంవత్సరాలైనా అది చెక్కు చెదరలేదు. మనవారు దాన్ని భద్రంగా కాపాడుకుంటూ వస్తున్నారు" అని వివరించారు. "అయ్యో... మేము ఇంత దగ్గర ఉండి కూడా ఇన్నాళ్ళూ చూడలేకపోయామే.



మీరు అమెరికానుంచి వచ్చి దాన్ని చూస్తున్నారు" అని ఆశ్చర్యపోయారు. ఇంతలో టైరును మార్చే పని పూర్తయ్యింది. అందరూ కలిసి నారాయణవనం వెళ్ళారు. ఏడుకొండలస్వామి ఎరుకలసాని వేషంలో ఆ  పుర వీధుల్లోనే తిరిగినాడని తెలుసుకుని పులకరించిపోయారు. ఆకాశరాజు పుత్రిక పద్మావతిగా అవతరించిన శ్రీ మహాలక్ష్మని శ్రీనివాసుడు వివాహమాడిన పుణ్యక్షేత్రాన్ని కనులారా చూశారు. అమ్మవారు విహారం చేసే విమాన ప్రదక్షణ మార్గంలో పసుపు కుంకుమలు పెట్టి ఉన్న తిరగలి కనిపించింది.  అంత పెద్ద తిరగలిని తామెప్పుడూ చూడలేదని ఆశ్చర్యపోతూ ముక్కుమీద వేలు వేసుకున్నారు. తిరగలిని భక్తిభావంతో తాకిన ఆ నలుగురూ పరవశించిపోయారు. తిరగలిని చూస్తూ ఎంతో బలవంతులైతే కానీ దాన్ని తిప్పలేరని అనుకున్నారు. అప్పట్లో మనుషులు అంత బలంగా ఉండేవారు కాబట్టి అది సాధ్యమయిందని తిరగలికి దణ్ణం పెట్టుకుని తిరుమల ప్రయాణం కొనసాగించారు.

# డాక్టరమ్మలు తగ్గిపోతున్నారు!

**ఎంబీబీఎస్‌లో పెరిగిన విద్యార్థినులు**
**వృత్తిలో చేరాక మానేస్తున్న వైద్యులు**
**అనుకూలంగా లేని  పరిస్థితులే కారణం**
**భవిష్యత్తులో ఆరోగ్య రంగానికి దెబ్బే!**
**'బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్' నివేదిక**

డాక్టరమ్మకే కష్టం వచ్చి పడింది! విరామం లేని డ్యూటీలు, మానసిక ఒత్తిడి, ఇంటికిఉఆసుపత్రికి మధ్య నలిగిపోయే దైనందిన పోరాటం.. ఆమెను వైద్య వృత్తిని వదిలిపెట్టేలా చేస్తున్నాయి. నిజానికి ఎంబీబీఎస్ పట్టాను సాధించటం అన్నది ఎన్నో నిద్ర లేని రాత్రుల కల! ఆ కలను నెరవేర్చుకున్నప్పటికీ, వృత్తి ధర్మాన్ని నిర్వర్తించలేని పరిస్థితులు లేడీ డాక్టర్‌లకు ఎదురవుతున్నాయి. మెడలో స్టెతస్కోప్ ధరించి, డాక్టరమ్మ చిరునవ్వుతో కనిపిస్తే చాలు.. జబ్బు సగం నయం అయినట్లే ఉంటుంది. కానీ ఇప్పుడా డాక్టరమ్మకే కష్టం వచ్చి పడింది! విరామం లేని డ్యూటీలు, మానసిక ఒత్తిడి, ఇంటికిఉఆసుపత్రికి మధ్య నలిగిపోయే దైనందిన పోరాటం.. ఆమెను వైద్య వృత్తిని వదిలిపెట్టేలా చేస్తున్నాయి. నిజానికి ఎంబీబీఎస్ పట్టాను సాధించటం అన్నది ఎన్నో నిద్ర లేని రాత్రుల కల! ఆ కలను నెరవేర్చుకున్నప్పటికీ, వృత్తి ధర్మాన్ని నిర్వర్తించలేని పరిస్థితులు లేడీ డాక్టర్‌లకు ఎదురవుతుండటం దురదృష్టకరమే కాదు, దేశ ఆరోగ్య వ్యవస్థకే నష్టం. ఇండియాలో ఎంబీబీఎస్ చదివే మహిళల సంఖ్య పెరుగుతున్నప్పటికీ.. ప్రాక్టీస్ చేసే సమయానికి మహిళా పట్టభద్రులుబీ ఉద్యోగంలో చేరి కొంత కాలం పని చేసిన తర్వాత మహిళా డాక్టర్లు వైద్య వృత్తిని వదిలిపెట్టేస్తున్నారట. బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ (బి.సి.జి.)ఉ దస్రా అనే స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా విడుదల చేసిన తాజా నివేదిక 'అడ్వాన్సింగ్ విమెన్ ఇన్ లీడర్‌షిప్ ఇన్ హెల్త్ కేర్'లో ఈ విషయాలు వెల్లడయ్యాయి. అనుకూలంగా లేని పరిస్థితులే అందుకు ప్రధాన కారణమని నివేదిక పేర్కొంది.

తీవ్రమైన ఒత్తిడి

పురుష డాక్టర్ల కంటే మహిళా డాక్టర్లు ఎక్కువ మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు. నివేదిక ప్రకారం, సుమారు 87 శాతం మంది మహిళా డాక్టర్లు మానసిక అలసటతో విధులను నిర్వర్తిస్తున్నారు.

ఇల్లుఉఆసుపత్రి

ఆసుపత్రిలో వారానికి 60 నుండి 80 గంటల కఠినమైన పని వేళలతో పాటు ఇంట్లో పిల్లల పెంపకం,  ఇతర కుటుంబ బాధ్యతలు కూడా మహిళలే చూసుకోవాల్సి వస్తోంది. ఈ రెండు రకాల బాధ్యతలను సమన్వయం చేసుకోలేక లేడీ డాక్టర్‌లు తమకు ఇష్టమైన వైద్య రంగాన్ని వదులుకోవలసి వస్తోంది.

భద్రతా సమస్యలు



మహిళా డాక్టర్లకు పని ప్రదేశంలో భద్రత అనేది పెద్ద సవాలుగా మారింది. ముఖ్యంగా చిన్న నగరాల్లో పనిచేసే వారిలో 70 శాతం కంటే ఎక్కువ మంది తాము సురక్షతంగా లేమని భావిస్తున్నట్లు తెలిపారు.

ప్రోత్సాహ లేమి

పని వేళలు అనుకూలంగా లేకపోవడం, ప్రసూతి సెలవుల తర్వాత తిరిగి చేరడానికి సరైన ప్రోత్సాహం లేకపోవడం వంటివి మహిళా వైద్యులను వెనక్కి లాగుతున్నాయి. అలాగే, వైద్య వృత్తిలో ఉన్నత పదవుల్లో మహిళలు తక్కువగా ఉండటం వల్ల మహిళా వైద్యుల సమస్యలను పట్టించుకునే వారు కరువయ్యారు.

ప్రభావం

మహిళా డాక్టర్లు వృత్తిని వదిలితే భవిష్యత్తులో గైనకాలజీ, పీడియాట్రిక్స్ వంటి విభాగాల్లో డాక్టర్ల కొరత ఏర్పడుతుంది. ఇది దేశ ఆరోగ్య వ్యవస్థపై ప్రభావం చూపుతుంది.

పరిష్కారం

పని ప్రదేశంలో మహిళా డాక్టర్ల భద్రతను పెంచటం పని వేళల్లో వెసులుబాటును కల్పించటం సమానమైన పనికి సమాన వేతనం పదోన్నతుల్లో సమానత్వం

గణాంకాలు.. ముఖ్యమైన అంశాలు

వృత్తిలో లేనివారు

పురుషుల్లో కేవలం 5ఉ10 శాతం మంది మాత్రమే ఖాళీగా ఉండగా, మహిళా పట్టభద్రుల్లో 30 శాతం మంది వైద్య వృత్తిలో కొనసాగటం లేదు.

స్పెషలైజేషన్‌లో వ్యత్యాసం

సర్జరీ, కార్డియాలజీ, ఆర్థోపెడిక్స్ విభాగాలలోని మొత్తం నిపుణుల్లో మహిళల వాటా 10 శాతం కంటే తక్కువే.

ప్రవేశాలలో కొరత

దేశ వ్యాప్తంగా ఇంకా 7ఉ8 లక్షల మంది వైద్య నిపుణుల అవసరం ఉన్నప్పటికీ, సుమారు 60ఉ70 వేల మంది మహిళా నిపుణులు వైద్య వృత్తిలోకి ప్రవేశించటం లేదు.

నర్సుల్లో మహిళలే అధికం

దేశంలోని ఆసుపత్రుల్లో ఉన్న నర్సుల్లో సుమారు 70ఉ85 శాతం మహిళలే. కానీ, డాక్టర్లలో సీనియర్ లీడర్‌షిప్ విభాగాల్లో మాత్రం మహిళల సంఖ్య 20 శాతానికే పరిమితమైంది.

